CELEBRATING 11TH YEAR ANNIVERSARY
ప్రకటన కర్తలకు,పాఠకులకు, తెలుగు ప్రజలకు, మిత్రులకు, శ్రేయోభిలాషులకు పెన్‌పవర్ వారి
11వ వార్షికోత్సవ శుభాకాంక్షలు

# పెన్ పవర్

తెలుగు దిన పత్రిక | PEN POWER TELUGU DAILY | ప్రశ్నించడం మన హక్కు

సంపుటి : 1 సంచిక : 56 పేజీలు :8 సంపాదకులు : జి.ఎ.రావు ( ఆనంద్ గంట్యాడ) ప్రచురణ : కడప ఆదివారం 2 నవంబర్ 2025 వెల : 5/-రూ ॥

VOLUME :1 ISSUE : 56 PAGES :8 EDITOR : G. A. RAO ( ANAND GANTYADA ) PUBLISHED :KADAPA SUN 2 NOVEMBER 2025 PRICE : 5/- RS

Simultaneously Published form Kadapa, Narasarao Peta,Bapatla,Ongole,Visakhapatnam,Kakinada, Circulated by :Srikakulam,manyam,Vizianagaram,East Godavari,West Godavari,Eluru,Guntur,SPSR Nellore,Tirupati,Chittor,Kurnool,Anantapur

## కాశీబుగ్గ తొక్కిసలాటపై ప్రధాని మోదీ దిగ్భ్రాంతి... రూ.2 లక్షల పరిహారం

- శ్రీకాకుళం జిల్లా కాశీబుగ్గ ఆలయంలో తొక్కిసలాట
- 9 మంది భక్తుల మృతి
- ఘటనపై తీవ్ర విచారం వ్యక్తం చేసిన ప్రధాని మోదీ
- పీఎం జాతీయ సహాయ నిధి నుంచి ఎక్స్‌గ్రేషియా ప్రకటన
- మృతుల కుటుంబాలకు రూ. 2 లక్షల ఆర్థిక సాయం
- గాయపడిన వారికి రూ. 50,000 పరిహారం



పెన్ పవర్ డెస్క్:ఆంధ్రప్రదేశ్‌లోని శ్రీకాకుళం జిల్లా కాశీబుగ్గ శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయంలో తొక్కిసలాట జరిగి 9 మంది మరణించిన ఘటనపై ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఈ దురదృష్టకర సంఘటన అత్యంత

వివరాలు 2లో..

## బీజేపీ, జేడీయూ ఇన్నేళ్లేం చేశాయి?

ఎన్డీయే కీలక హామీపై ప్రియాంక గాంధీ ప్రశ్న



- ఎన్డీయే కోటి ఉద్యోగాల హామీ గురించి మీడియా ప్రశ్నించగా స్పందించిన ప్రియాంక గాంధీ
- బీజేపీ నకిలీ జాతీయవాదాన్ని ప్రచారం చేస్తోందని విమర్శ
- ప్రజల దృష్టిని మళ్లించలేక ఓట్ల చోరీకి పాల్పడుతోందని ఆగ్రహం

వివరాలు 2లో..



- కాశీబుగ్గ ప్రమాద ఘటనపై ఏపీ ప్రభుత్వం ప్రకటన
- ఘటనలో 9 మంది భక్తులు మృతి, 13 మందికి గాయాలు
- మృతుల కుటుంబాలకు రూ. 5 లక్షల చొప్పున ఆర్థిక సాయం
- గాయపడిన వారికి రూ. 50 వేల చొప్పున చికిత్స ఖర్చులు
- ఘటనపై ఉన్నతస్థాయి కమిటీతో విచారణకు ఆదేశం
- భవిష్యత్తులో ఇలాంటివి జరగకుండా కఠిన చర్యలు తీసుకుంటామని హామీ

# కాశీబుగ్గ ఆలయంలో తొక్కిసలాట, 9 మంది భక్తుల మృతి

- ఏకాదశి కావడంతో ఆలయానికి భారీగా పోటెత్తిన భక్తులు
- ఘటనపై తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేసిన సీఎం చంద్రబాబు నాయుడు
- క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలని అధికారులకు ఆదేశం
- కొనసాగుతున్న సహాయక చర్యలు.. మృతుల సంఖ్య పెరిగే అవకాశం





పెన్ పవర్ డెస్క్:శ్రీకాకుళం జిల్లాలో ఘోర విషాదం చోటుచేసుకుంది. కాశీబుగ్గ పట్టణంలోని శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయంలో శనివారం జరిగిన తొక్కిసలాటలో 9 మంది భక్తులు ప్రాణాలు కోల్పోయారు. ఈ దుర్ఘటనలో పలువురు తీవ్రంగా గాయపడ్డారు. ఏకాదశి పర్వదినం కావడంతో ఆలయానికి భక్తులు భారీ సంఖ్యలో తరలిరావడమే ఈ విషాదానికి కారణమైంది. ఏకాదశి సందర్భంగా వేంకటేశ్వర స్వామిని దర్శించుకునేందుకు వేలాదిగా భక్తులు కాశీబుగ్గ ఆలయానికి పోటెత్తారు. ఒక్కసారిగా రద్దీ పెరిగిపోవడంతో తోపులాట జరిగి, అది కాస్తా తొక్కిసలాటకు దారితీసింది. ఏం జరుగుతుందో తెలుసుకునే లోపే పలువురు భక్తులు కిందపడిపోయారు. వారిపై నుంచి ఇతరులు పరుగులు తీయడంతో ఊపిరాడక కొందరు అక్కడికక్కడే మృతి చెందారు. ఈ విషాద ఘటనపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. "శ్రీకాకుళం జిల్లా కాశీబుగ్గలోని వేంకటేశ్వర ఆలయంలో జరిగిన తొక్కిసలాట దిగ్భ్రాంతికి గురిచేసింది. ఈ విషాద ఘటనలో భక్తులు మృతి చెందడం హృదయ విదారకం. మృతుల కుటుంబాలకు నా ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నాను" అని ఆయన పేర్కొన్నారు. గాయపడిన వారికి వేగంగా, సరైన వైద్యం అందించాలని

వివరాలు 2లో..

## కాశీబుగ్గలో తొక్కిసలాట ఘటనపై ముఖ్యమంత్రి చంద్రబాబు తీవ్ర దిగ్భ్రాంతి

- అంతపెద్ద తుపానులో ఎక్కువ ప్రాణనష్టం లేకుండా చూశాం... కానీ ఇవాళ భారీ ప్రాణ నష్టం జరిగింది: సీఎం చంద్రబాబు
- కాశీబుగ్గ ఘటనపై ముఖ్యమంత్రి చంద్రబాబు తీవ్ర విచారం
- ప్రైవేటు వ్యక్తుల బాధ్యతారాహిత్యం వల్లే ఈ ఘోరం జరిగిందని వ్యాఖ్య
- ఘటనకు కారకులైన వారిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరిక
- పోలీసులకు ముందే సమాచారం ఇచ్చి ఉంటే ప్రాణనష్టం ఉండేది కాదన్న సీఎం
- సత్యసాయి జిల్లా సభలో మృతులకు రెండు నిమిషాలు మౌనం పాటింపు
- పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో ఈ ఘటనపై స్పందించిన చంద్రబాబు



పెన్ పవర్ డెస్క్:శ్రీకాకుళం జిల్లా కాశీబుగ్గలో జరిగిన తొక్కిసలాట ఘటనపై ముఖ్యమంత్రి చంద్రబాబు తీవ్ర దిగ్భ్రాంతి, ఆవేదన వ్యక్తం చేశారు. ప్రైవేటు వ్యక్తుల బాధ్యతారాహిత్యం, నిర్లక్ష్యం కారణంగానే ఇంత పెద్ద ప్రాణనష్టం జరగడం అత్యంత బాధాకరమని అన్నారు. ఈ దుర్ఘటనకు కారకులైన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన స్పష్టం చేశారు.శనివారం శ్రీ సత్యసాయి జిల్లా పెద్దన్నవారిపల్లిలో 'పేదల సేవలో' కార్యక్రమంలో భాగంగా ముఖ్యమంత్రి లబ్ధిదారులకు స్వయంగా పింఛన్లు అందజేశారు. అనంతరం జరిగిన ప్రజావేదిక సభలో ఆయన మాట్లాడుతూ కాశీబుగ్గ ఘటనను ప్రస్తావించారు.

అంత పెద్ద తుపానులో ముందస్తు ప్రణాళిక ద్వారా ఎక్కువ ప్రాణ నష్టం లేకుండా చూడగలిగామని... తీరా చూస్తే ఈరోజు ప్రైవేటు వ్యక్తుల బాధ్యతా రాహిత్య చర్యలతో ఇంత పెద్ద

వివరాలు 2లో..



## బీహార్ లో ఎన్నికల ప్రచారానికి మొంథా తుపాను దెబ్బ

- బీహార్‌ను అతలాకుతలం చేస్తున్న మొంథా తుపాను
- ఎన్నికల ప్రచార సభలపై తీవ్ర ప్రభావం
- హెలికాప్టర్లు ఎగరక పలువురు నేతల ర్యాలీలు రద్దు
- వరి పంటకు తీవ్ర నష్టం.. రైతుల ఆందోళన
- పలు జిల్లాలకు భారీ వర్ష సూచన జారీ
- ఆదివారం నుంచి వాతావరణంలో మెరుగుదల

పెన్ పవర్ డెస్క్:తీరం దాటినా గానీ మొంథా తుపాను అనేక రాష్ట్రాలను అతలాకుతలం చేస్తోంది. తాజాగా, బీహార్ రాష్ట్రంలో గత మూడు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలు, బలమైన ఈదురు గాలుల కారణంగా జనజీవనం స్తంభించడంతో పాటు, రాష్ట్రంలో జరుగుతున్న ఎన్నికల ప్రచారంపై కూడా తీవ్ర ప్రభావం పడింది. ప్రతికూల వాతావరణంతో శుక్రవారం దాదాపు 23 ఎన్నికల ర్యాలీలు రద్దయ్యాయి. శనివారం కూడా ఇదే పరిస్థితి కొనసాగనుంది.వాతావరణం అనుకూలించ

వివరాలు 2లో..

## ఏపీలో ఈ నెల 3 నుంచి ధాన్యం కొనుగోళ్లు... 48 గంటల్లోనే రైతులకు డబ్బులు

- నవంబరు 3 నుంచి రాష్ట్రవ్యాప్తంగా ధాన్యం కొనుగోలు
- వాట్సాప్ సందేశంతో సులభంగా రైతుల రిజిస్ట్రేషన్
- ఈ ఖరీఫ్ సీజన్‌లో 51 లక్షల టన్నుల సేకరణ లక్ష్యం
- ధాన్యం కొన్న 48 గంటల్లోగా రైతుల ఖాతాల్లోకి డబ్బులు
- రాష్ట్రవ్యాప్తంగా 5 వేలకు పైగా కొనుగోలు కేంద్రాల ఏర్పాటు
- తాడేపల్లిగూడెంలో కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించనున్న మంత్రి నాదెండ్ల

వివరాలు 2లో..



## కాశీబుగ్గ ఆలయం ప్రభుత్వానికి చెందినది కాదు: దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి ఫ్యాక్ట్ చెక్


- శ్రీకాకుళం కాశీబుగ్గ ఆలయంలో తొక్కిసలాటపై స్పందించిన మంత్రి ఆనం
- వెంకటేశ్వర ఆలయం ప్రభుత్వ దేవాదాయ శాఖ పరిధిలో లేదని స్పష్టీకరణ
- ఓ ప్రైవేట్ వ్యక్తి తన సొంత స్థలంలో, సొంత నిధులతో నిర్మించిన ఆలయమని వెల్లడి
- 3 వేల సామర్థ్యమున్న ఆలయానికి 25 వేల మంది రావడమే ప్రమాదానికి కారణం
- నిర్వాహకులు ఏర్పాట్లు చేయకపోగా, ప్రభుత్వానికి సమాచారం ఇవ్వలేదని ఆరోపణ
- సీఎం ఆదేశాలతో సహాయక చర్యలు ముమ్మరంగా జరుగుతున్నాయని వెల్లడి

వివరాలు 2లో..



## గత ప్రభుత్వ హయాంలో నా ఫ్యామిలీని టార్గెట్ చేశారు

- మాజీ సీజేఐ జస్టిస్ ఎన్వీ రమణ సంచలన వ్యాఖ్యలు
- ఫ్యామిలీపై క్రిమినల్ కేసులు పెట్టారని ఆరోపణ
- అమరావతి రైతుల పోరాటాన్ని కొనియాడిన మాజీ సీజేఐ



పెన్ పవర్ డెస్క్:సుప్రీంకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎన్వీ రమణ సంచలన వ్యాఖ్యలు చేశారు. గత ప్రభుత్వ హ యాంలో తన కుటుంబాన్ని లక్ష్యంగా చేసుకుని క్రిమినల్ కేసులు నమోదు చేశారని ఆయన ఆరోపించారు.

వివరాలు 2లో..

## హైదరాబాద్ స్కూల్లో విద్యార్థులతో కలిసి వాలీబాల్ ఆడిన నారా భువనేశ్వరి

- ఎన్టీఆర్ ట్రస్ట్ పాఠశాలలో విద్యార్థులతో కలిసి భువనేశ్వరి సందడి
- విద్యార్థులతో ముచ్చటించిన నారా భువనేశ్వరి
- ఎన్టీఆర్ కుటీరంలో జరిగే స్పోర్ట్స్ ఫెస్ట్‌ను ప్రారంభించిన నారా భువనేశ్వరి

వివరాలు 2లో..



## అమెరికా షట్ డౌన్.. 31 రోజుల్లో రూ. 62 వేల కోట్ల సంపద ఆవిరి

- కీలక బిల్లుల విషయంలో అధికార, విపక్షాల మధ్య కుదరని సయోధ్య
- షట్ డౌన్ ప్రభావంపై కాంగ్రెషనల్ బడ్జెట్ ఆఫీస్ అంచనాలు విడుదల
- 8 వారాలు షట్ డౌన్ అయితే 14 బిలియన్ డాలర్ల ఆర్థిక నష్టం జరుగుతుందని అంచనా



పెన్ పవర్ డెస్క్:అమెరికాలో షట్‌డౌన్ కొనసాగుతోంది. కీలక బిల్లుల విషయంలో అధికార, విపక్షాల మధ్య సయోధ్య కుదరకపోవడంతో 31 రోజులుగా అమెరికా ఆర్థిక వ్యవస్థ షట్ డౌన్‌లోనే ఉంది. నెల రోజులకు పైగా షట్‌డౌన్ కావడంతో అమెరికా ఆర్థిక వ్యవస్థలో 7 బిలియన్ డాలర్లకు పైగా సంపద ఆవిరైంది. ఈ మేరకు కాంగ్రెషనల్ బడ్జెట్ కార్యాలయం అంచనా వేసింది. ఇది మన కరెన్సీలో రూ. 62,149 కోట్లకు పైగా ఉంటుంది.

వివరాలు 2లో..

## ఎడిటర్ వ్యూ

# అయితే 150..లేకపోతే 10.. ప్రశాంత్ కిషోర్ లెక్కలేంటో?

దేశంలోనే అత్యంత పాపులర్ పొలిటికల్ స్ట్రాటజిస్ట్ (వ్యూహకర్త)గా పేరుగాంచిన ప్రశాంత్ కిశోర్ (పీకే) సొంత రాష్ట్రం బిహార్ రాజకీయాల్లో ఎదుర్కొంటున్న సవాళ్లు ప్రస్తుతం హాట్ టాపిక్‌గా మారాయి. నరేంద్ర మోదీ, జగన్, స్టాలిన్, మమతా బెనర్జీ లాంటి ఎందరినో ప్రధానులను (మోడీని), ముఖ్యమంత్రులను చేసిన ఘనత ఆయనకు ఉంది. అలాంటి పీకే, తన జన సురాజ్ పార్టీ ని బిహార్‌లో అధికారంలోకి తెచ్చే విషయంలో మాత్రం ఆపసోపాలు పడుతున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి.

**150 లేకపోతే 10... లెక్కల్లో మ్యాజిక్**

బిహార్ అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో పీకే చేసిన వ్యాఖ్యలు ఈ చర్చకు మరింత ఆజ్యం పోశాయి. తమ పార్టీకి 150కి పైగా సీట్లు వస్తాయని, లేకపోతే 10 కంటే తక్కువ సీట్లకే పరిమితం అవుతామని ఆయన ప్రకటించడం వ్యూహాత్మకంగా కనిపిస్తోంది. మధ్యేమార్గం ఉండదంటూ ఆయన చేసిన వ్యాఖ్య... ఓటర్లను జన సురాజ్ వైపు మొగ్గు చూపేలా, దీర్ఘకాలంగా నెలకొన్న నిరాశను తొలగించేలా విశ్వాసాన్ని నింపే ప్రయత్నంగా విశ్లేషకులు భావిస్తున్నారు. ఈ ప్రకటన పీకేకు ఉన్న లెక్కల మీద నమ్మకాన్ని సూచించినా, ఇది బిహార్ ఓటర్ల మనసును ఎంతవరకు ప్రభావితం చేస్తుందనేది చూడాలి.

**సొంత పోటీపై వెనుకడుగు ఎందుకు?**

జన సురాజ్ పార్టీని స్థాపించినా, పీకే సొంతంగా పోటీ చేయకపోవడం కూడా విమర్శలకు కేంద్రబిందువైంది. ఒకానొక దశలో రాఘోపూర్ లేదా కర్గాహర్ నుంచి బరిలో ఉంటానని పీకే హింట్ ఇచ్చినా, తుది నిర్ణయంగా ఈ ఎన్నికల్లో పోటీ చేయకూడదని పార్టీ నిర్ణయించిందని ప్రకటించారు. దీనిపై సోషల్ మీడియాలో 'పీకేకు తన ఓటమి భయం వెంటాడుతోందా?', 'అందరి జాతకం చెప్పే పీకేకు సొంత జాతకం అర్థం కావడం లేదా?' అన్న విమర్శలు వస్తున్నాయి. అయితే, తాను వ్యక్తిగతంగా పోటీ చేయకుండా పార్టీ నిర్మాణం, అభ్యర్థుల విజయంపైనే పూర్తిగా దృష్టి పెడతానని పీకే చెప్పడం వెనుక ఎన్నికల్లో ఓడిపోతే పరువుపోతుందన్న భయం వెంటాడుతుంది కావచ్చు అన్న చర్చ సాగుతోంది.

పీకే దృష్టిలో, తాను ఎక్స్-ఫ్యాక్టర్ కాదు, జన సురాజ్ పార్టీ గెలిచిన సీట్లే ముఖ్యమనే అభిప్రాయాన్ని బలంగా వినిపిస్తున్నారు. బిహార్‌లో మహాగఠ్‌బంధన్ లేదా ఎన్డీయేకు ప్రత్యామ్నాయం లేదన్న అభిప్రాయం కేవలం ఒక అభిప్రాయం మాత్రమే, వాస్తవం కాదని ఆయన వాదిస్తున్నారు. పార్టీ అభ్యర్థులు ఓడిపోతేనే, పార్టీ భవిష్యత్తు అంధకారంలో పడే ప్రమాదం ఉంది. అందుకే, గెలుపు - ఓటమిని కేవలం పీకే పోటీ చేశాడా లేదా అన్నదానితో ముడిపెట్టకుండా, పార్టీ విజయాన్ని ఒక సమిష్టి కృషికే ఆపాదిస్తున్నారు.

**'పీకే' వ్యూహంలో దాగున్న లక్ష్యం**

పీకే తన జన్ సురాజ్ యాత్ర ద్వారా బిహార్‌లో విద్య, ఆరోగ్యం, ఉపాధి వంటి కీలక సమస్యలను ప్రజల దృష్టికి తీసుకెళ్తున్నారు. ఆయన ఏ కూటమితోనూ పొత్తు పెట్టుకోబోనని స్పష్టం చేయడం, బిహార్ ఓటర్లు కులం, కుటుంబ పాలనకు భయపడి ఓటు వేసే 30 ఏళ్ల రాజకీయ శకం ముగిసిపోతోందని పేర్కొనడం ద్వారా కొత్త, కులరహిత ప్రత్యామ్నాయంగా జన సురాజ్‌ను ప్రజల్లోకి తీసుకెళ్లే ప్రయత్నం చేస్తున్నారు. ఇతర పార్టీలు తమ అభ్యర్థులను భయపెట్టి నామినేషన్లు విత్‌డ్రా చేయిస్తున్నాయని ఆయన ఆరోపించడం కూడా, తమ పార్టీ బలం పట్ల ఉన్న అపనమ్మకాన్ని సూచిస్తుంది.

మొత్తంగా, బిహార్ రాజకీయాల్లోని పాత తరం (లాలు-నితీష్) నుంచి ప్రజల దృష్టిని మళ్లించి, నూతన తరానికి అండగా నిలబడాలన్నది పీకే ప్రధాన లక్ష్యం నెరవేరేలా కనిపించం లేదు.. బీహార్ లో ఓడిపోతే పరువు పోతుందని.. భవిష్యత్తు ఉండదని.. వ్యూహకర్తగానూ కొనసాగలేనన్న భయం ఆయన మాటల్లో వ్యక్తమవుతోంది.

తన ఎన్నికల విజయాలను ఓటర్ల మనోభావాలను అంచనా వేసి అందించిన వ్యూహకర్త.. సొంతంగా స్థాపించిన పార్టీ విషయంలో ప్రకటించిన 150 %జం% 10 సీట్లు అనే ఈ విపరీతమైన లెక్క బిహార్‌లో ఆయన ఓటమిని ముందే ఒప్పుకున్న చర్చకు దారితీస్తోంది. ఎవరు నెగ్గుతారో .. ఎవరు ఓడుతారో ముందేచెప్పే ప్రశాంత్ కిషోర్ తన జాతకం ఏంటో చెప్పలేకపోతున్నాడా? అన్న డౌట్లు వస్తున్నాయి. అందరి జాతకం చెప్పే ప్రశాంత్ కిషోర్ తన జాతకం ఏంటో అర్థం కాని పరిస్థితి ప్రస్తుతం నెలకొంది. దేశంలోనే పాపులర్ వ్యూహకర్త.. సొంత బీహార్ లో ఏం 'పీకే'లేకపోతున్నాడా? అన్న విమర్శలు సోషల్ మీడియాలో వస్తున్నాయి.

# హైదరాబాద్ స్కూల్లో విద్యార్థులతో కలిసి వాలీబాల్ ఆడిన నారా భువనేశ్వరి

ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి, తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబు అర్ధాంగి నారా భువనేశ్వరి విద్యార్థులతో కలిసి వాలీబాల్ ఆడారు. హైదరాబాద్‌లోని ఎన్టీఆర్ ట్రస్ట్ పాఠశాలలో ఆమె విద్యార్థులతో సరదాగా గడిపారు. రెండు జట్ల మధ్య మ్యాచ్ కోసం టాస్ వేశారు. అనంతరం విద్యార్థులతో కాసేపు ముచ్చటించారు. ఆ తర్వాత వారితో కలిసి ఉత్సాహంగా వాలీబాల్ ఆడారు. హైదరాబాద్ సమీపంలోని మొయినాబాద్ మున్సిపల్ పరిధిలోని హిమాయత్ నగర్‌లో ఉన్న ఎన్టీఆర్ కుటీరంలో మూడు రోజుల పాటు జరిగే ఎన్టీఆర్ స్పోర్ట్స్ అండ్ కల్చరల్ ఫెస్ట్ పోటీలు ఎన్టీఆర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో శనివారం ప్రారంభమయ్యాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన భువనేశ్వరి జ్యోతి ప్రజ్వలన చేసి క్రీడలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ఎన్టీఆర్ చారిటబుల్ ట్రస్ట్ ఛైర్‌పర్సన్‌గా కాకుండా ఒక అమ్మలాంటి వ్యక్తిగా వ్యవహరిస్తున్నానని అన్నారు. తమ ట్రస్ట్ సంపద కోసం కాకుండా విద్యార్థుల భవిష్యత్తు కోసం పాటుపడుతోందని తెలిపారు. దేశానికి సేవ చేసే పౌరులుగా విద్యార్థులను తీర్చిదిద్దడమే తమ లక్ష్యమని పేర్కొన్నారు. విద్యార్థులు చదువుకునే సమయంలోనే జీవితంపై అవగాహన పెంచుకుని ముందుకు సాగలని సూచించారు.ఎన్ని అవరోధాలు వచ్చినా వెనక్కి చూడకుండా ముందుకు సాగడమే లక్ష్యంగా విద్యార్థి దశలోనే ప్రణాళికలు రూపొందించుకోవాలని ఆమె అన్నారు. ఈ క్రీడలు కేవలం పోటీలు మాత్రమే కాదని, మీ భవిష్యత్తు కలలకు వేదిక అని అన్నారు. ఎన్టీఆర్ ట్రస్ట్‌లో చదువుకున్న విద్యార్థులు దేశవిదేశాల్లో ఉన్నత స్థానాల్లో ఉన్నారని, వారు దేశం కోసం పని చేస్తున్నారని తెలిపారు. మీ నమ్మకమే మార్గం సుగమం చేస్తుందని విద్యార్థులకు సూచించారు. విద్యార్థి దశలోనే లక్ష్యాలను నిర్దేశించుకోవాలని, అందుకు తమ ట్రస్ట్ పూర్తి సహాయసహకారాలు అందిస్తుందని హామీ ఇచ్చారు. ఎన్టీఆర్ ట్రస్ట్ ద్వారా ప్రారంభమైన ఈ క్రీడా పోటీల్లో విద్యార్థులు ఎంతో ఉత్సాహంగా పాల్గొన్నారని నారా భువనేశ్వరి పేర్కొన్నారు. ఈ క్రీడా పోటీల్లో దాదాపు 40 పాఠశాలలు, కళాశాలలకు చెందిన వెయ్యి మందికి పైగా విద్యార్థులు పాల్గొన్నారు.

# బీజేపీ, జేడీయూ ఇన్నేళ్లేం చేశాయి?

బీహార్ అసెంబ్లీ ఎన్నికల్లో 'ఇండియా' కూటమి విజయం సాధిస్తుందని ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి, ఎంపీ ప్రియాంక గాంధీ ధీమా వ్యక్తం చేశారు. బీహార్‌లో ఎన్నికల ప్రచారాన్ని ప్రారంభించడానికి ముందు ఆమె పాట్నా విమానాశ్రయంలో విలేకరులతో మాట్లాడుతూ, ఎన్డీయే కూటమి ఇచ్చిన వాగ్దానాలను అమలు చేయలేదని విమర్శించారు.

ఎన్డీయే ప్రభుత్వం కోటి ఉద్యోగాల హామీ గురించి మీడియా ప్రతినిధులు ప్రశ్నించగా, ఇన్నేళ్లు అధికారంలో ఉండి ఎందుకు నెరవేర్చలేదని ఆమె బీజేపీ, జేడీయూలను నిలదీశారు.

**బెగుసరాయ్‌లో తొలి ప్రచార సభలో ప్రియాంక గాంధీ విమర్శలు**

ఎన్నికల్లో గెలుపొందేందుకు ఎన్డీయే ప్రభుత్వం విభజన రాజకీయాలకు పాల్పడుతోందని ప్రియాంక గాంధీ ఆరోపించారు. బెగుసరాయ్‌లో తన తొలి ప్రచార సభలో ఆమె మాట్లాడుతూ, బీజేపీ నకిలీ జాతీయవాదాన్ని ప్రచారం చేస్తోందని మండిపడ్డారు. సమస్యల నుంచి ప్రజల దృష్టిని మళ్లించలేక ఓట్ల చోరీకి పాల్పడుతోందని ధ్వజమెత్తారు. ఓట్ల తొలగింపు అనేది హక్కుల ఉల్లంఘనతో సమానమని ఆమె వ్యాఖ్యానించారు.

దేశాభివృద్ధికి బీహార్ ఎంతో తోడ్పడిందని, కానీ రాష్ట్రాభివృద్ధి విషయంలో మాత్రం వెనుకబడి ఉందని ఆమె అన్నారు. బీజేపీ నాయకులు నిత్యం గతం, భవిష్యత్తు గురించే మాట్లాడుతున్నారని, ప్రస్తుతం గురించి మాత్రం మాట్లాడటం లేదని విమర్శించారు. నెహ్రూ, ఇందిరాగాంధీలను విమర్శిస్తున్నారే తప్ప నిరుద్యోగం, వలసల గురించి పట్టించుకోవడం లేదని దుయ్యబట్టారు. విభజన రాజకీయాలు చేస్తున్నారని మండిపడ్డారు.

బీహార్‌లో డబుల్ ఇంజిన్ ప్రభుత్వం లేదని, ప్రతిదీ ఢిల్లీ నుంచి నియంత్రిస్తారని ప్రియాంక గాంధీ అన్నారు. ఎన్డీయే పాలనలో పెద్ద ఎత్తున ప్రైవేటీకరణ జరుగుతోందని విమర్శించారు. ప్రభుత్వ రంగ సంస్థలను ప్రధానమంత్రి నరేంద్ర మోదీ కొద్దిమందికే అప్పగించారని ఆరోపించారు.

# కాశీబుగ్గ ఆలయం ప్రభుత్వానికి చెందినది కాదు: దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి ఫ్యాక్ట్ చెక్

శ్రీకాకుళం జిల్లాలోని కాశీబుగ్గ వెంకటేశ్వర ఆలయంలో జరిగిన తొక్కిసలాట దుర్ఘటనపై రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి స్పందించారు. ఈ ఘటన పూర్తిగా ఆలయ నిర్వాహకుల వైఫల్యం వల్లే జరిగిందని ఆయన స్పష్టం చేశారు. సదరు ఆలయం ప్రభుత్వ దేవాదాయ శాఖ పరిధిలోనిది కాదని, అది ఒక ప్రైవేట్ దేవాలయమని కీలక విషయాలు వెల్లడించారు. మంత్రి ఆనం రామనారాయణరెడ్డి మాట్లాడుతూ, "కాశీబుగ్గలోని వెంకటేశ్వర ఆలయాన్ని హరిముకుంద్‌పండా అనే వ్యక్తి తన సొంత నిధులతో, తనకు చెందిన 12 ఎకరాల స్థలంలో నిర్మించారు. ఈ ఆలయం ప్రభుత్వ నిర్వహణలో కానీ, దేవాదాయ శాఖ ఆధీనంలో కానీ లేదు. ఇది పూర్తిగా ఒక ప్రైవేట్ వ్యవహారం" అని వివరించారు.ఆలయ సామర్థ్యానికి మించి భక్తులు రావడం వల్లే ఈ దుర్ఘటన చోటుచేసుకుందని ఆయన తెలిపారు. "ఆలయ సామర్థ్యం కేవలం 2,000 నుంచి 3,000 మంది మాత్రమే. కానీ, శనివారం ఏకాదశి కావడంతో ఒక్కసారిగా దాదాపు 25,000 మంది భక్తులు తరలివచ్చారు. ఇంత పెద్ద సంఖ్యలో భక్తులు వస్తున్నప్పుడు నిర్వాహకులు అందుకు తగ్గట్టుగా ఏర్పాట్లు చేయడంలో విఫలమయ్యారు. కనీసం ప్రభుత్వానికి లేదా పోలీసులకు కూడా సమాచారం ఇవ్వలేదు. ఈ నిర్లక్ష్యమే తొక్కిసలాటకు దారితీసింది" అని మంత్రి పేర్కొన్నారు.ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశాల మేరకు సహాయక చర్యలు ముమ్మరంగా కొనసాగుతున్నాయని మంత్రి తెలిపారు. మంత్రులు, అధికారులు ఘటనా స్థలంలో సహాయక చర్యలను పర్యవేక్షిస్తున్నారని, క్షతగాత్రులను సమీప ఆసుపత్రులకు తరలించి మెరుగైన వైద్యం అందిస్తున్నామని ఆయన వివరించారు.

# ఏపీలో ఈ నెల 3 నుంచి ధాన్యం కొనుగోళ్లు... 48 గంటల్లోనే రైతులకు డబ్బులు

రాష్ట్రంలోని రైతులకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం శుభవార్త చెప్పింది. 2025%-%26 ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి ధాన్యం కొనుగోలు ప్రక్రియను నవంబరు 3వ తేదీన ప్రారంభించనున్నట్లు పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు రాష్ట్రవ్యాప్తంగా అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఆయన వెల్లడించారు.ధాన్యం విక్రయించాలనుకునే రైతులు సులభంగా తమ పేర్లను నమోదు చేసుకునేందుకు ఈసారి వాట్సాప్ సదుపాయాన్ని అందుబాటులోకి తెచ్చినట్లు మంత్రి తెలిపారు. రైతులు తమ ఫోన్ నుంచి 7337359375 అనే వాట్సాప్ నంబర్‌కు "%ఎ×%" అని సందేశం పంపడం ద్వారా రిజిస్ట్రేషన్ ప్రక్రియను పూర్తి చేసుకోవచ్చని సూచించారు.ఈ ఖరీఫ్ సీజన్‌లో ప్రభుత్వం 51 లక్షల టన్నుల ధాన్యం కొనుగోలు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు నాదెండ్ల మనోహర్ వివరించారు. ఇందుకోసం రాష్ట్రవ్యాప్తంగా 3,013 రైతు సేవా కేంద్రాలు, 2,061 ధాన్యం కొనుగోలు కేంద్రాలను సిద్ధం చేశామని చెప్పారు. ధాన్యం సేకరణ ప్రక్రియలో సుమారు 10,700 మంది సిబ్బంది పాల్గొంటారని, రైతుల నుంచి ధాన్యం సేకరించిన 24 నుంచి 48 గంటల్లోనే వారి బ్యాంకు ఖాతాల్లోకి డబ్బు జమ అయ్యేలా పటిష్టమైన చర్యలు తీసుకుంటున్నామని భరోసా ఇచ్చారు.గత ఏడాది అనుభవాలను దృష్టిలో ఉంచుకుని ఈసారి ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులను ఆదేశించినట్లు మంత్రి పేర్కొన్నారు. "నాణ్యమైన గోనె సంచులు ముందుగానే సిద్ధం చేసుకోవాలి. తేమ శాతాన్ని నిర్ధారించే యంత్రాలు, రవాణా సౌకర్యాల విషయంలో సమస్యలు రాకుండా చూడాలి" అని అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేసినట్లు తెలిపారు.

నవంబర్ 3వ తేదీ సోమవారం పశ్చిమ గోదావరి జిల్లా తాడేపల్లిగూడెం నియోజకవర్గంలోని ఆరుగొలను గ్రామంలో మంత్రి నాదెండ్ల మనోహర్ అధికారికంగా ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించనున్నారు.

## అమెరికా షట్ డౌన్.. 31 రోజుల్లో రూ. 62 వేల కోట్ల సంపద ఆవిరి

- మొదటి పేజి తరువాయి

షట్‌డౌన్ ఇలాగే కొనసాగితే ఆర్థిక వ్యవస్థపై ఏ మేరకు ప్రభావం పడుతుందో కూడా బడ్జెట్ కార్యాలయం అంచనాలు విడుదల చేసింది. ఇప్పటికే షట్‌డౌన్ వల్ల 7 బిలియన్ డాలర్ల మేర సంపద ఆవిరైందని, ఆరు వారాలకు ఇది 11 బిలియన్ డాలర్లు, ఎనిమిది వారాలకు 14 బిలియన్ డాలర్ల మేర ఆర్థిక నష్టం జరుగుతుందని అంచనా వేసింది.ఆర్థిక వ్యవస్థ బలహీనంగా ఉందని, ఈ షట్‌డౌన్ వంటివి ఊహించిన దానికంటే అధిక సమస్యగా పరిణించవచ్చని మూడీస్ అనలిటిక్స్‌కు చెందిన మార్క్ జాండీ ఆందోళన వ్యక్తం చేశారు. ఈ షట్‌డౌన్ ప్రభావం చిన్నగా ప్రారంభమైనప్పటికీ, ఆర్థిక వ్యవస్థపై తీవ్ర ప్రభావం చూపించవచ్చని కేపీఎంజీ సంస్థలోని చీఫ్ ఎకనమిస్ట్ డయాన్ స్వాంక్ అన్నారు.1981 నుంచి అమెరికా ప్రభుత్వం 15 సార్లు మూతబడింది. డొనాల్డ్ ట్రంప్ అధ్యక్షుడిగా ఉన్న 2018-19 మధ్య 35 రోజుల పాటు మూతబడింది. దేశ చరిత్రలో అది సుదీర్ఘ షట్‌డౌన్‌గా నిలిచింది. ప్రస్తుత షట్‌డౌన్ జాబ్ మార్కెట్‌పై తీవ్ర ప్రభావం చూపుతుందని ఆర్థిక నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

## కాశీబుగ్గ తొక్కిసలాటపై ప్రధాని మోదీ దిగ్భ్రాంతి... రూ.2 లక్షల పరిహారం

- మొదటి పేజి తరువాయి

బాధాకరమని పేర్కొన్నారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సంతాపం తెలిపిన ప్రధాని, బాధితులకు ఆర్థిక సహాయాన్ని ప్రకటించారు. ఈ ఘటనపై స్పందించిన ప్రధాని మోదీ, "ఆంధ్రప్రదేశ్‌లోని శ్రీకాకుళం జిల్లా కాశీబుగ్గ శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయంలో జరిగిన తొక్కిసలాట అత్యంత బాధాకరం. తమ సన్నిహితులను, కుటుంబసభ్యులను కోల్పోయిన వారికి ప్రగాఢ సంతాపం తెలియజేస్తున్నాను. గాయపడినవారు త్వరగా కోలుకోవాలని ప్రార్థిస్తున్నాను" అని ఓ ప్రకటనలో పేర్కొన్నారు. అదేవిధంగా,

ఈ ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయిన వారి కుటుంబాలకు ప్రధానమంత్రి జాతీయ సహాయ నిధి (%ూవీచీ=ఖీ%) నుంచి రూ. 2 లక్షల చొప్పున ఎక్స్‌గ్రేషియా మంజూరు చేస్తున్నట్లు తెలిపారు. గాయపడిన వారికి రూ. 50,000 ఆర్థిక సహాయం అందిస్తామని ప్రధాని కార్యాలయం వెల్లడించింది. ఆలయంలో జరిగిన ఈ విషాద ఘటన స్థానికంగా తీవ్ర కలకలం రేపింది.

## కాశీబుగ్గ ఆలయంలో తొక్కిసలాట, 9 మంది భక్తుల మృతి

- మొదటి పేజి తరువాయి

అధికారులను ఆదేశించినట్లు చంద్రబాబు తెలిపారు. స్థానిక అధికారులు, ప్రజాప్రతినిధులు వెంటనే ఘటనా స్థలానికి వెళ్లి సహాయక చర్యలను పర్యవేక్షించాలని కోరినట్లు వివరించారు. ప్రస్తుతం ఘటనా స్థలంలో సహాయక చర్యలు కొనసాగుతున్నాయి. క్షతగాత్రులను సమీప ఆసుపత్రులకు తరలించి చికిత్స అందిస్తున్నారు. మృతుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉందని అధికారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

## కాశీబుగ్గలో తొక్కిసలాట ఘటనపై ముఖ్యమంత్రి చంద్రబాబు తీవ్ర దిగ్భ్రాంతి

- మొదటి పేజి తరువాయి

ప్రాణనష్టం జరిగిందని... ఇది అత్యంత బాధాకరమని అన్నారు. కాగా, ప్రజావేదిక సభ వేదికగా కాశీబుగ్గ మృతులకు సంతాపంగా రెండు నిముషాల పాటు మౌనం పాటించారు. ఆలయ నిర్వాహకులు ముందుగానే పోలీసులకు చెప్పి ఉంటే భక్తులను క్యూలైన్లలో నియంత్రించేందుకు అవకాశం ఉండేదని చంద్రబాబు అన్నారు. ఘటనకు కారకులైన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

## బీహార్ లో ఎన్నికల ప్రచారానికి మొంథా తుపాను దెబ్బ

- మొదటి పేజి తరువాయి

కపోవడంతో హెలికాప్టర్లు ఎగిరే పరిస్థితి లేకపోయింది. దీంతో ముఖ్యమంత్రి నితీశ్ కుమార్, ప్రతిపక్ష నేత తేజస్వి యాదవ్, బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా, కేంద్ర మంత్రి జితన్ రామ్ మాంఝీ, నటుడు పవన్ సింగ్ వంటి పలువురు కీలక నేతలు తమ ప్రచార కార్యక్రమాలను రద్దు చేసుకోవాల్సి వచ్చింది. కొందరు నేతలు సభలకు భౌతికంగా హాజరుకాలేకపోయినా, మొబైల్ ఫోన్ల ద్వారా ప్రజలను ఉద్దేశించి ప్రసంగించారు. శనివారం సహర్సాలో జరగాల్సిన కాంగ్రెస్ ఎంపీ ప్రియాంక గాంధీ ర్యాలీ కూడా రద్దయింది. దీంతో ఆమె బచ్‌వారా అసెంబ్లీ నియోజకవర్గానికి రోడ్డు మార్గంలో వెళ్లి సభలో పాల్గొన్నారు.

ఈ తుపాను ప్రభావం కేవలం రాజకీయాలకే పరిమితం కాలేదు. రాష్ట్రవ్యాప్తంగా ఖరీఫ్ పంటలకు, ముఖ్యంగా వరి పంటకు తీవ్ర నష్టం వాటిల్లింది. కోత దశలో ఉన్న పంట దెబ్బతినడంతో దిగుబడిపై ప్రభావం పడుతుందని రైతులు ఆందోళన చెందుతున్నారు. వాతావరణ శాఖ ప్రకారం, శనివారం కూడా చాలా జిల్లాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు, ఈదురు గాలులు కొనసాగే అవకాశం ఉంది. అరారియా, కిషన్‌గంజ్, పూర్నియా ప్రాంతాలకు భారీ వర్ష సూచన జారీ చేశారు.

ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాల కారణంగా రాష్ట్రంలోని చాలా నగరాల్లో గరిష్ఠ, కనిష్ఠ ఉష్ణోగ్రతలు పడిపోయాయి. శనివారం బంకాలో అత్యధికంగా 27.4 డిగ్రీల సెల్సియస్, వాల్మీకి నగర్‌లో అత్యల్పంగా 20.6 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. పలుచోట్ల రోడ్లపై నీరు నిలిచిపోవడంతో ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. కొన్ని ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడ్డారు. ప్రజలు ఇళ్లలోనే ఉండాలని, అనవసర ప్రయాణాలు చేయవద్దని పరిపాలన యంత్రాంగం విజ్ఞప్తి చేసింది. ఆదివారం (నవంబర్ 2) నుంచి వాతావరణం క్రమంగా మెరుగుపడే అవకాశం ఉందని వాతావరణ శాఖ తెలిపింది.

## గత ప్రభుత్వ హయాంలో నా ఫ్యామిలీని టార్గెట్ చేశారు

- మొదటి పేజి తరువాయి

అమరావతిలోని వీఐటీ యూనివర్సిటీ 5వ స్నాతకోత్సవానికి ముఖ్య అతిథిగా హాజరైన సందర్భంగా ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు.ఈ కార్యక్రమంలో జస్టిస్ రమణ మాట్లాడుతూ, గత ప్రభుత్వ పాలనలో జరిగిన పరిణామాలను ప్రస్తావించారు. ఆ సమయంలో తనను మాత్రమే కాకుండా, చివరికి తన కుటుంబాన్ని కూడా టార్గెట్ చేశారని, వారిపై క్రిమినల్ కేసులు బనాయించారని తీవ్ర వ్యాఖ్యలు చేశారు. ఆయన వ్యాఖ్యలు ప్రస్తుతం రాజకీయ, న్యాయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారాయి.కాగా, రాజధాని అమరావతి నిర్మాణం రైతుల కష్టం, త్యాగాల పునాదులపై జరుగుతోందని జస్టిస్ రమణ అన్నారు. దేశ స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత ఒక రాజధాని కోసం ఇంత సుదీర్ఘంగా పోరాటం చేసిన ఘనత అమరావతి రైతులదేనని కొనియాడారు. కష్టకాలంలో న్యాయ వ్యవస్థపై రైతులు నమ్మకం ఉంచినందుకు వారికి ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు.శనివారం వీఐటీ యూనివర్సిటీలో 5వ స్నాతకోత్సవం అట్టహాసంగా జరిగింది. ఈ కార్యక్రమానికి జస్టిస్ ఎన్వీ రమణ ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులకు పట్టాలు ప్రదానం చేశారు.

# పెన్ పవర్
నెల్లూరు । తిరుపతి । చిత్తూరు


## పోగొట్టుకున్న పర్సును ప్రయాణికుడికి అందజేసిన డియం.

**కావలి :పెన్ పవర్ -(ఆర్సీ ఇంచార్జ్) నవంబర్ 1**

సిద్ధనకొండూరు గ్రామానికి చెందిన పైడి కిషోర్ శనివారం కావలి బస్టాండ్ లో బస్ దిగి కూల్ డ్రింక్స్ షాప్ దగ్గర కూల్ డ్రింక్స్ తాగుతూ తన చేతిలో ఉన్న పర్సు పోగొట్టుకున్నారు. ఈ విషయాన్ని ఆ ప్రయాణికుడు బస్టాండ్ లోని విచారణ కేంద్రంలో తెలిపాడు. అదే సమయంలో కూల్ డ్రింక్ షాపు పనిచేసే వ్యక్తి,పర్సు క్రిందపడి ఉండడం గమనించి, ఆ పర్సును నిజాయితీతో విచారణ కేంద్రంలో ఇచ్చాడు. బస్టేషన్ మేనేజర్ యం రామకృష్ణ, బస్టాండ్ లోని పోలీసు అవుట్ పోస్ట్ డ్యూటీలో ఉన్న పోలీసు కానిస్టేబుల్ , ఆర్టీసీ సెక్యూరిటీ సిబ్బంది సమక్షంలో పర్సు పోగొట్టుకున్న వ్యక్తిని వివరములు అడిగి ఆ పర్సును చెక్ తనిఖీ చేయగా, అందులో అతను చెప్పినవిధంగా, 23 వేల రూపాయలు విలువైన ఒక బంగారు ఉంగరం ఉన్నది. కావలి డిపో మేనేజర్ డి ఆదినారాయణ, ఆ బంగారు ఉంగరం ఉన్న పర్సును, పోగొట్టుకున్న పైడి కిషోర్ కు అందజేశారు.



## పోలీస్ అమరవీరుల వారోత్సవాల సందర్భంగా నిర్వహించిన వివిధ కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులు, పోలీసు సిబ్బంది పిల్లలకు ప్రశంసా పత్రాలు మరియు బహుమతులు అందజేసిన ఎస్పీ ఎల్. సుబ్బరాయుడు, ఐపీఎస్.







**తిరుపతి/పెన్ పవర్/నవంబర్ 01**

త్యాగమే సేవకు మూలం – పోలీస్ అమరవీరుల త్యాగాలు మన దేశ గర్వకారణం. పోలీస్ అమరవీరుల వారోత్సవాల సందర్భంగా నిర్వహించిన వివిధ సాంస్కృతిక, క్రీడా, వ్యాసరచన, వాదప్రతివాద (డిబేట్) పోటీల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులు, పోలీసు సిబ్బంది పిల్లలు, మరియు పోలీసు సిబ్బందిని జిల్లా ఎస్పీ శ్రీ ఎల్. సుబ్బరాయుడు, ఐపీఎస్., ప్రశంసించి, ప్రశంసా పత్రాలు మరియు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమం పోలీసు గెస్ట్ హౌస్ కాన్ఫరెన్స్ హాల్లో ఘనంగా ఈ రోజు జరిగింది. జిల్లా ఎస్పీ గారు ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై, విజేతలను అభినందించారు. మొత్తం 18 మంది ప్రతిభావంతులైన విద్యార్థులు, పోలీసు క్రీడా విజేతలు, మరియు పోలీసు సిబ్బంది పిల్లలకు ప్రశంసా పత్రాలు, జ్ఞాపికలు మరియు బహుమతులు జిల్లా ఎస్పీ గారు స్వయంగా ప్రదానం చేశారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ శ్రీ ఎల్. సుబ్బరాయుడు, ఐపీఎస్., గారు మాట్లాడుతూ “సమాజంలో పోలీసు శాఖకు ఒక ప్రత్యేక స్థానం ఉంది. శాంతి భద్రతల పరిరక్షణలో ముందువరసలో ఉండి ప్రజల భద్రత కోసం పోలీసులు నిరంతరం కృషి చేస్తున్నారు. పోలీసు శాఖ సంక్షేమం కోసం ఎల్లప్పుడూ కట్టుబడి ఉన్నాము,” అన్నారు. అమరవీరుల త్యాగాల స్ఫూర్తితో యువత మరియు పోలీసు సిబ్బంది దేశభక్తి, క్రమశిక్షణ, సామాజిక బాధ్యతతో ముందుకు సాగాలని ఆయన పిలుపునిచ్చారు. “ఈ కార్యక్రమాల ద్వారా దేశ ఐకమత్యం, సేవాభావం, క్రీడా స్ఫూర్తి పెంపొందించుకోవడం ప్రతి ఒక్కరి కర్తవ్యం,” అని అన్నారు. ఎస్పీ గారు మరింతగా పేర్కొంటూ “దేశ రక్షణ, అంతర్గత భద్రతలో ప్రాణాలను అర్పించిన పోలీస్ సిబ్బందిని స్మరించేందుకు ప్రతి సంవత్సరం అక్టోబర్ 21న ‘పోలీస్ అమరవీరుల దినోత్సవం’ను నిర్వహిస్తాం. అక్టోబర్ 21 నుండి 31 వరకు సర్దార్ వల్లభభాయ్ పటేల్ జయంతి వరకు అమరవీరుల స్మారక వారోత్సవాలు నిర్వహించి, ఇందులో ప్రతిభ కనబరిచిన వారిని సన్మానించడం మా గౌరవం,” అన్నారు “దేశ భద్రత కోసం ప్రాణాలను అర్పించిన అమరవీరుల త్యాగాలు మనందరికీ స్ఫూర్తి. ఆ త్యాగాలను గుర్తు చేసుకోవడం మన సమాజపు బాధ్యత,” అని %ఐశిళిజీగి% గారు అన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పి నాగభూషణరావు (నేర విభాగం) డిఎస్పీలు శ్రీలత (మహిళ పోలీస్ స్టేషన్) శ్యాంసుందర్ (క్రైమ్)ఆర్ఐ హరికృష్ణ (వెల్ఫేర్)పోలీస్ అసోసియేషన్ సోము, శంకర్ రెడ్డి మరియు సిబ్బంది విద్యార్థులు పాల్గొన్నారు.

## వర్షాలు వస్తే చాలు అల్లు మడుగు చెరువు పక్కనే పోతున్న వేడం రోడ్డు చెరువుల తలపిస్తున్న దుస్థితి..

### రోడ్డుకి ఇరువైపుల కలవర్టును పూడ్చివేత రోడ్డు కనిపించక ప్రజలు ఇక్కట్లు సంబంధిత అధికారులు పట్టించుకోని వైనం..







**శ్రీకాళహస్తి ,పెన్ పవర్ ,నవంబర్ 1 :**

శ్రీకాళహస్తి నియోజకవర్గం శ్రీకాళహస్తి మండలం తుఫాన్ సెంటర్ దాటగానే అల్లు మడుగు చెరువు పక్కనే పోతున్న వేడం రోడ్డు వారం రోజులకు కురుస్తున్న భారీ వర్షాలకు ఆర్ అండ్ బి రోడ్డు ఇరుపక్కల ఆక్రమణ గురి కావడంతో అదేవిధంగా రోడ్డు పక్కనే ఉన్న పైపు కలవర్టును పూడ్చివేయడంతో భారీ వర్షాలకు రోడ్డు చెరువుల తలపిస్తూ దుస్థితి... ఇబ్బంది పడుతున్న ప్రజలు... పట్టించుకోని సంబంధిత అధికారులు, స్థానిక ఎమ్మెల్యే సార్ స్పందించి అధికారులకు ఆదేశాలు జారీ చేసి, రోడ్డుపై చెరువుల తలపిస్తున్న వర్షపునీరును పోవడానికి మరమ్మత్తులు చేపట్టాలని పలువురు ప్రజలు వ్యక్తం చేస్తున్నారు.

## తక్షణం ఉపాధి బిల్లులు చెల్లించండి



**శ్రీకాళహస్తి , పెన్ పవర్ , నవంబర్ 1 :**

ఉపాధి హామీ పథకంలో పెండింగ్ బిల్లులను తక్షణమే చెల్లించాలని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి దాసరి జనార్ధన్ డిమాండ్ చేశారు. స్థానిక పుచ్చలపల్లి సుందరయ్య భవనంలో శనివారం వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కమిటీ సమావేశం జరిగింది. ఎనిమిది వారాలుగా బిల్లుల రాక వ్యవసాయ కూలీలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని జనార్ధన్ ఆవేదన చెందారు. తక్షణమే జిల్లా అధికారులు జోక్యం చేసుకొని కూలీలకు రావాల్సిన బకాయిలు చెల్లించాలని విజ్ఞప్తి చేశారు. సామాజిక తనిఖీల్లో వస్తున్న అవినీతి ఆరోపణలపై సమగ్ర విచారణ జరిపి అక్రమార్కులపై కఠినమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఏడాదికి 200 రోజులు పని, రూ.600 రూపాయల వేతనం ఇవ్వాలని కోరారు. గ్రామీణ ప్రాంతాల్లో పేదలకు ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు మూడు సెంట్లు ఇంటి స్థలం, రూ. 5 లక్షలు ఇంటి నిర్మాణానికి మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. జిల్లాలో అసైన్మెంట్ భూములపై సమగ్ర విచారణ జరిపి అక్రమార్కుల చేతుల్లో ఉన్న డీకేటి భూములను పేదలకు పంచాలని సూచించారు. వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు టి బాలకృష్ణ, ఉపాధ్యక్షులు నలుగూరి రమణయ్య, ఆముద, తిరుపాల్, బాల గురవయ్య, కృష్ణయ్య, శంకరయ్య, ముని శంకర్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రతినెలా ఒకటో తేదీన రాష్ట్రంలో పింఛన్ల పండుగ

- పెన్షన్ల పంపిణీలో సీఎం చంద్రబాబు చరిత్ర సృష్టించారు.
- బుచ్చిరెడ్డి పాళెం పట్టణ అభివృద్ధికి కృషి చేస్తున్న ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి గార్లకు ధన్యవాదాలు.
- 7,11, వ వార్డులో పింఛన్ల పంపిణీ సందర్భంగా చైర్ పర్సన్ మోర్ల సుప్రజ మురళి గారు.





**బుచ్చిరెడ్డిపాలెం పెన్ పవర్ నవంబర్. 1.**

ప్రతినెలా ఒకటో తేదీన రాష్ట్రంలో పింఛన్ల పండుగరోజు అని, పింఛన్ల పంపిణీతో సీఎం చంద్రబాబు గారు చరిత్ర సృష్టించారన్నారు చైర్ పర్సన్ మోర్ల సుప్రజ మురళి గారు. బుచ్చిరెడ్డి పాళెం 7,11, వ వార్డ్ లో ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. లబ్ధిదారుల ఇళ్ల వద్దకు వెళ్లి పింఛన్లు అందించి వారి యోగక్షేమాలు తెలుసుకుంటూ పెన్షన్ల పంపిణీ కార్యక్రమాన్ని కొనసాగించారు. ఈ సందర్భంగా చైర్ పర్సన్ మోర్ల సుప్రజ మురళి గారు మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా ప్రతి నెల ఒకటో తారీఖున రాష్ట్రంలో పింఛన్ల పంపిణీ పండుగ రోజుగా అభివర్ణించారు . ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి గారి ఆదేశాల మేరకు పెన్షన్ల పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టినట్టు ఆమె తెలిపారు. ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన మాట ప్రకారం పింఛన్లు పెంచి వృద్ధులకు రూ.4వేలు, వికలాంగులకు రూ.6వేలు, మంచానికి పరిమితమైన వికలాంగులకు రూ.15వేలు అందిస్తున్నామని చెప్పారు. పింఛను పొందుతున్న లబ్ధిదారుల కళ్ళలో ఆనందం చూస్తే సంతోషంగా ఉందని తెలియజేశారు.. ఏడవ వార్డులో కొత్తగా రెండు పింఛన్లు పంపిణీ చేయడం జరిగిందని తెలియజేశారు. వాటిలో ఒక పించను దాదాపు రెండు సంవత్సరాలు పెండింగ్లో ఉంటే మన కోవూరు శాసన సభ్యురాలు శ్రీమతి వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి గారు ఆ ఏరియాలో పర్యటించినప్పుడు, ఆ ఏరియాలో ఉండే కౌన్సిలర్లు ,నాయకులు ఎమ్మెల్యే గారి దృష్టికి తీసుకెళ్లగా ఎమ్మెల్యే గారు అధికారులతో మాట్లాడి పెన్షన్ పెట్టివ్వడం జరిగిందని, అలాగే రెండో పెన్షన్ భర్త చనిపోయిన రెండు నెలలకే ఆమె కూడా పెన్షన్ ఇవ్వడం జరిగిందని , కొత్తగా పెన్షన్ తీసుకున్న ఈ ఇద్దరు పెన్షన్ దారులు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి గారికి, ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారని చైర్పర్సన్ గారు తెలియజేశారు... ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్పర్సన్ మోర్ల సుప్రజ మురళి గారితో పాటు 11వ వార్డ్ కౌన్సిలర్ రాచూరి సత్యం, టౌన్ అధ్యక్షులు గుత్తా శ్రీనివాసులు, పంచాయతీ సెక్రటరీలు, టిడిపి నాయకులు సుభాన్, సందాని, అల్తాఫ్ ,తదితరులు పాల్గొన్నారు.

## నవంబరు 2న శ్రీవారి ఆలయంలో కైశికద్వాదశి ఆస్థానం

**తిరుమల/పెన్ పవర్/ నవంబర్ 01**

నవంబరు 2వ తేదీన కైశిక ద్వాదశి పర్వదినాన్ని పురస్కరించుకొని శ్రీవారి ఆలయంలో సాలకట్ల కైశిక ద్వాదశి ఆస్థానాన్ని టిటిడి నిర్వహించనుంది. వేంకటతురైవార్, స్నపనబేరంగా పిలిచే ఉగ్రశ్రీనివాసమూర్తిని శ్రీదేవి భూదేవి సమేతంగా ఒక్క కైశిక ద్వాదశి రోజు మాత్రమే సూర్యోదయానికి ముందు మాడవీధులలో ఊరేగిస్తారు. చారిత్రక వివరాలలోనికి వెళితే కైశిక ద్వాదశిని ప్రబోధనోత్సవం అని, ఉత్తానద్వాదశి అని కూడా వ్యవహరిస్తారు. వివిధ గ్రంథాల్లో పేర్కొన్న విధంగా స్థితికారుడైన శ్రీమహావిష్ణువును మేల్కొల్పేపర్వదినాన్ని కైశికద్వాదశిగా వ్యవహరిస్తారు. శ్రీమహావిష్ణువు ఆషాఢశుక్ల ఏకాదశినాడు గాఢ నిద్రలోకి వెళ్ళారు. కైశికద్వాదశినాడు ఆయనను మేల్కొల్పు చేయడం రివాజు. సాక్షాత్తు శ్రీ మహావిష్ణువుస్వరూపంగా భావించే కలియుగ ప్రత్యక్ష దైవమైన శ్రీవేంకటేశ్వరస్వామి కొలువైవున్న శ్రీవారి ఆలయంలో కైశికద్వాదశి మహోత్సవాన్ని ప్రతిఏటా టిటిడి ఘనంగా నిర్వహిస్తుంది.

**ప్రాశస్త్యం..**

పురాణాల ప్రకారం శ్రీవైష్ణవ క్షేత్రాల్లో నిర్వహించే ముఖ్యమైన పర్వదినాల్లో కైశికద్వాదశి ఒకటి. శ్రీ వరాహ స్వామి కైశికపురాణంలోని 82 శ్లోకాలతో శ్రీ భూదేవికి కథగా చెప్పిన రోజును కైశిక ఏకాదశిగాపిలుస్తారు. ఈ కథ ఆధారంగా కైశిక ద్వాదశి ప్రత్యేకతను సంతరించుకుంది.

**నంబదువాన్ కథ**

కైశికద్వాదశి పురాణ నేపథ్యం విశేష ఘట్టాలతో కూడుకున్నది. శ్రీ నంబదువాన్ (సత్యమూర్తి) అనే భక్తుడు స్వామివారికి కైశిక రాగంలో అక్షరమాలను నివేదించడానికి వెలుతుండగా మార్గమధ్యంలోఒక బ్రహ్మరాక్షసుడు తారసపడి తినేస్తానన్నాడు. అందుకు నంబదువాన్ సమాధానంగా తాను ప్రస్తుతం శ్రీవారికి సంకీర్తనార్చన చేయడానికి వెళుతున్నానని తప్పక తిరిగివచ్చి ఆ



బ్రహ్మరాక్షసునిక్షుద్బాధను తీరుస్తానని ప్రమాణం చేశాడు. అన్న ప్రకారం స్వామివారికి కైశిక రాగంలో అక్షరమాలను నివేదించి బ్రహ్మరాక్షసుని చెంతకు వచ్చాడు. భక్త నంబదువాన్ భక్తికి, సత్యనిరతికి ముగ్ధుడైస్వామివారు మోక్షం ప్రసాదించారు. ఈ విధంగా ఉత్తానద్వాదశికి కైశికద్వాదశి అనే నామకరణం కలిగింది.

**సూర్యదయానికి ముందే ఎందుకు?**

14వ శతాబ్దంలో ఉగ్రశ్రీనివాసమూర్తి ఊరేగింపు జరుగుతూ ఉండగా సూర్య కిరణాలు స్వామివారి విగ్రహం మీద పడగానే భాగీ అగ్ని ప్రమాదం జరిగింది. అప్పటి నుండి సూర్యోదయానికి ముందేఊరేగింపు నిర్వహిస్తున్నారు.

**ఆస్థానం**

ఉగ్రశ్రీనివాసమూర్తిని శ్రీదేవి భూదేవి సమేతంగా సూర్యోదయానికి ముందే తెల్లవారుఝామున 4.30 నుండి 5.45 గంటల వరకు ఆలయ తిరుమాడ వీధులలో ఊరేగిస్తారు. అనంతరం ఆలయంలోపల ఉదయం 6 నుండి ఉదయం 7.30 గంటల వరకు కైశిక ద్వాదశి ఆస్థానాన్ని పురాణ పారాయణం ద్వారా ఘనంగా నిర్వహిస్తారు. దీనితో సాలకట్ల కైశికద్వాదశి ఉత్సవం పూర్తవుతుంది.

## ఎన్టీఆర్ భరోసా పెన్షన్ కార్యక్రమంలో



**బుచ్చిరెడ్డిపాలెం పెన్ పవర్ నవంబర్. 1**

గౌరవనీయులైన ముఖ్యమంత్రివర్యులు శ్రీ నారా చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు కోవూరు నియోజకవర్గ గౌరవ ఎమ్మెల్యే శ్రీ వేమిరెడ్డి ప్రశాంత్ రెడ్డి సూచనల మేరకు బుచ్చి నగర పంచాయతీ పరిధిలోని 17 వార్డు నందు తాళ్ల వైష్ణవి పెన్షన్ పంపిణీ కార్యక్రమం జరిగింది ఈ కార్యక్రమంలో సచివాలయం సిబ్బందితో కలిసి ఇంటింటికి వెళ్లి ఉద్దాంత వితంతు మరియు వికలాంగుల పెన్షన్కు అర్హులకు అందజేయడం జరిగింది.


## ఎ.ఎం.సి.చైర్మన్ మరియు డైరెక్టర్లకు వాల్మీకుల సత్కారం!



**పలమనేరు,పెన్ పవర్,నవంబరు 01,**

పలమనేరు మార్కెట్ కమిటీ నూతన చైర్మన్ కె.రాజన్న(ఆలకుప్పం), డైరెక్టర్ శంకరప్పలను శనివారం చైర్మన్ స్వగ్రామమైన ఆలకుప్పంలో వాల్మీకి సంఘనేతలు ఘనంగా సత్కరించారు.చైర్మన్, డైరెక్టర్లను గజమాల, శాలువలతో సత్కరించి అభినందించారు.ఈ సందర్భంగా వాల్మీకి సంఘనేతలు మాట్లాడుతూ.. పలమనేరు మార్కెట్ కమిటీకి మొట్టమొదటిసారిగా వాల్మీకి సామాజిక వర్గానికి చెందిన కె. రాజన్నను చైర్మన్ గా, శంకరప్పను డైరెక్టర్ గా నియమించినందుకు రాష్ట్ర ప్రభుత్వానికి, ప్రత్యేకంగా పలమనేరు శాసనసభ్యులు,మాజీ మంత్రివర్యులు ఎన్. అమర్నాథ్ రెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో వాల్మీకి సంఘరాష్ట్ర నాయకులు మరియు పలమనేరు బార్ అసోసియేషన్ అధ్యక్షులు ఎల్.భాస్కర్, మాజీ సర్పంచ్ జి. శ్రీనివాసులు, మామడుగు నీటి వినియోగదారుల సంఘ అధ్యక్షులు బాలకృష్ణ, గంగవరం టీడీపీ కార్యదర్శి బాలాజీ, రొంటకుంట్ల నరసింహులు,చిన్నూరు అశోక్,మునస్వామి,టి. బైరప్ప లు పాల్గొన్నారు.

## శ్రీకాళహస్తి ఆలయ అభివృద్ధిలో భ్రమరాంబ ముద్ర పాలన



**శ్రీ కాళహస్తి , పెన్ పవర్ , నవంబర్ 1 :**

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర దేవాదాయ శాఖలో జూనియర్ అసిస్టెంట్ గా ఉద్యోగం పొంది, ప్రమోషన్ తీసుకుంటూ పలు శాఖల్లో పనిచేస్తూ ఈవో స్థాయికి ఎదిగింది దర్భముళ్ల భ్రమరాంబ. రాష్ట్రంలోని ముఖ్య దేవాలయాల్లో పని చేశారు. ఈవోగా కనకమహాలక్ష్మి దేవాలయం, విశాఖపట్నం సింహాచలం ఇఓగా పనిచేశారు. అనంతరం శ్రీకాళహస్తి దేవస్థానం ఈవోగా పనిచేశారు. పలు అభివృద్ధి కార్యక్రమంలో తనదైన పాలనలో ముద్ర వేసారు. స్కిట్ కళాశాల పునః ప్రారంభించేందుకు తీవ్రంగా కృషి చేశారు. అలాగే మాస్టర్ ప్లాన్ అమలుకు సుమారు రూ. 90 కోట్ల పైగా లబ్ధిదారులకు స్థలాలకు పరిహారం చెల్లించారు. ఆలయంలో అక్రమ వసూళ్లకు అడ్డుకట్ట వేసి, అదాయాన్ని గణనీయంగా పెరిగేందుకు కృషి చేశారు. మహాశివరాత్రి ఉత్సవాలకు తరలివచ్చే ఆశేష సంఖ్యలో తరలివచ్చే భక్తులందరికి దర్శనం కల్పించాలనే ఉద్దేశ్యంతో మహా లఘు దర్శనాన్ని ఏర్పాటు చేసి, విమర్శకుల చేత మెప్పు పొందారు. అనంతరం ఆమె ఏడు జిల్లాల ఆర్ జె సి గా కూడా పనిచేస్తూ శ్రీకాళహస్తి ఈవోగా ఉండి ఆదాయాన్ని దాదాపు 90 కోట్ల పై చిలుకు బ్యాంకులో డిపాజిట్ చేయించారు. బంగారు బ్యాంకులో డిపాజిట్ చేశారు. విజయవాడ శ్రీ కనక దుర్గమ్మ ఆలయ ఈవోగా బదిలీ అయ్యారు. ఆమె శ్రీకాళహస్తి ఆలయం నుండి బదిలీ అయ్యే సమయానికి బ్యాంకు డిపాజిట్లు దాదాపు 200 కోట్లు పైచిలుకు డిపాజిట్ల రూపంలో వేసారు. అలాగే కైలాసగిరి ప్రదక్షిణ రోడ్డును విస్తరించి, సిమెంటు రోడ్డు నిర్మాణానికి సంకల్పించారు. ఆమె ఇఓగా ఉన్న రెండు సంవత్సరాలు మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు ఎంతో చక్కగా నిర్వహించారు. శ్రీకాళహస్తి ఆలయ పరిపాలన కూడా చాలా ఆదర్శ వంతంగా సాగించారు. ఇలా శ్రీకాళహస్తి ఆలయానికి ఆమె హయాంలో జరిగిన అభివృద్ధిని ఆమె పదవి విరమణ సందర్భంగా స్థానికులు గుర్తు చేసుకున్నారు.

# బుచ్చిరెడ్డిపాలెం నారాయణ పాఠశాలలో ఘనంగా జరిగిన ఎస్ ఎల్ సి కార్యక్రమం







బుచ్చిరెడ్డిపాలెం పెన్ పవర్ నవంబర్ 1. నారాయణ ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో జిఎం వేమిరెడ్డి విజయభాస్కర్ రెడ్డి గారి ఆధ్వర్యంలో ప్రిన్సిపల్ ఇస్మాయిల్ గారు ఎస్ ఎల్ సి కార్యక్రమమును పాఠశాల ఆవరణంలో ఘనంగా నిర్వహించడం జరిగినది ఈ కార్యక్రమాన్ని ముందుగా పట్టణ ఎస్సై సిహెచ్ సంతోష్ కుమార్ రెడ్డి గారి చేతుల మీదుగా జ్యోతి ప్రజ్వలనతో ప్రారంభించడం జరిగినది. ఈ కార్యక్రమంలో భాగంగా 1 మరియు 2వ తరగతులకు సంబంధించిన విద్యార్థులకు సెమిస్టర్ వన్ జూన్ నుండి అక్టోబర్ వరకు జరిగిన అకాడమిక్ ప్రోగ్రాం షెడ్యూల్ లో ఉన్నటువంటి అన్ని సబ్జెక్టుల పాఠ్యాంశాలను విద్యార్థులు తల్లిదండ్రుల సమక్షంలో ఎంతో చక్కగా వివరించడం జరిగినది ఈ వివరణను ప్రత్యక్షంగా వీక్షించినటువంటి తల్లిదండ్రులు ఎంతగానో ఆనందాన్ని వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన బుచ్చిరెడ్డిపాలెం పట్టణ ఎస్సై సిహెచ్ సంతోష్ కుమార్ రెడ్డి గారు విద్యార్థులతో ముచ్చటించి పలు ప్రశ్నలు వేసి సమాధానాలను తెలుసుకొని పిల్లలను ప్రశంసించారు. ప్రిన్సిపల్ ఇస్మాయిల్ గారు మాట్లాడుతూ ఎస్ ఎల్ సి అనగా స్టూడెంట్ లెడ్ కాన్ఫరెన్స్ అని దీని యొక్క ముఖ్య ఉద్దేశం విద్యార్థులలో ఉన్నటువంటి కమ్యూనికేషన్ స్కిల్స్ ను అభివృద్ధి చేయడానికి విద్యార్థులలో నాయకత్వ లక్షణాలను పెంపొందించి వారిలో ఉన్న ప్రతిభను వెలికి తీయడం కోసం ఈ ఎస్ ఎల్ సి కార్యక్రమాన్ని నిర్వహించామని మరీ ముఖ్యంగా ఈ ఎస్ ఎల్ సి కార్యక్రమం అనేది మొట్టమొదటిసారిగా నారాయణ పాఠశాల యాజమాన్యం వారు మాత్రమే ఆవిష్కరించడం జరిగిందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఏజీఎం రమణారెడ్డి గారు కోఆర్డినేటర్ ప్రసన్న గారు ఏవో కృష్ణమోహన్ వైస్ ప్రిన్సిపాల్ సుజాత ఉపాధ్యాయ ఉపాధ్యాయేతర సిబ్బంది మరియు తల్లిదండ్రులు విద్యార్థులు పాల్గొని ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయడం జరిగినది.

## తెలుగు సాహిత్య సాంస్కృతిక సమితి 13వ వార్షికోత్సవం

### నేడు సొంత కళామందిరంలో..






**పలమనేరు,పెన్ పవర్,నవంబరు 01,**

తెలుగు భాషా పరిరక్షణ ధ్యేయంగా చిత్తూరు జిల్లా పలమనేరులో నందు 2012 నవంబరు ఒకటవ తేదీన ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులైన పి. తులసినాథం నాయుడు,పుష్ప దంపతులు తెలుగు సాహిత్య సాంస్కృతిక సమితిని స్థాపించారు. స్థాపించిన నాటి నుండి నిరంతర కార్యక్రమాలతో 13 సంవత్సరాలు పూర్తి చేసుకుని నవంబరు రెండవ తేదీ ఆదివారం పలమనేరులోని సొంత కళామందిరంలో 13వ వార్షికోత్సవాన్ని ఘనంగా జరుపుకుంటున్నది. సమితి ఆధ్వర్యంలో ఇప్పటివరకు రెండు లక్షల పుస్తకాలను పంచిపెట్టడం జరిగింది. సంవత్సరానికి 70 నుంచి 80 కార్యక్రమాలు చేస్తూ రాష్ట్రస్థాయిలో ప్రత్యేక గుర్తింపు సంపాదించింది. ముఖ్యంగా విద్యార్థులను దృష్టిలో ఉంచుకొని పద్యాల పోటీలు,వ్యాసరచన పోటీలు,కథల పోటీలు లాంటివి నెలకొక కార్యక్రమం నిర్వహిస్తూ ఇప్పటివరకు వేలాదిమంది పిల్లలకు ప్రశంశాపత్రాలు జ్ఞాపికలు పుస్తక బహుమతులు అందించి పిల్లల్లో తెలుగు భాషపట్ల ఆసక్తిని రేకెత్తిస్తున్నారు. ప్రతి వేమన జయంతి సందర్భంగా వంద వేమన పద్యాలు చెప్పగలిగే పిల్లలకు వెయ్యి రూపాయలు నగదుతో పాటు బహుమతులు ఇస్తున్నారు.కవులు రచయితలను తరచుగా కార్యక్రమాలు ఏర్పాటు చేసి సత్కరిస్తూ ప్రోత్సహిస్తున్నారు. వేసవి సెలవులలో పిల్లలకు తెలుగు భాషా మరియు నైతిక విలువలు నేర్పడానికి ఉచిత వేసవి శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నారు. కార్యక్రమాల నిర్వహణ కోసం 50 లక్షల రూపాయల విలువైన సొంత కళామందిరాన్ని నిర్మించుకున్నారు. అవధానాలు,కవి సమ్మేళనాలు ప్రముఖ కవులు,రచయితల జయంతులు,వర్ధంతి కార్యక్రమాలు క్రమం తప్పకుండా నిర్వహిస్తున్నారు.ఈ కార్యక్రమాలన్నీ కూడా తమ సొంత నిధులతోనే చేయడం విశేషం.

ఈరోజు 13వ వార్షికోత్సవాన్ని జరుపుకుంటున్న సందర్భంగా పలువురు అభినందనలు తెలియజేశారు.

## ఘనంగా ఆంధ్ర రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకలు.



**కావలి :పెన్ పవర్ -(ఆర్సీ ఇంచార్జ్) నవంబర్ 1**

ఆంధ్ర రాష్ట్ర ఆవిర్భావానికి మూల కారణమైన అమరజీవి పొట్టి శ్రీరాములు త్యాగాన్ని స్మరించుకుంటూ శనివారం కావలి పట్టణంలోని వెంగళరావు నగర్ లో ఉన్న ప్రభుత్వ గ్రంథాలయంలో గ్రంథాలయ అధికారి బొమ్మల కోటేశ్వరి అధ్యక్షతన ఆంధ్ర రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ముందుగా పొట్టి శ్రీరాములు చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా సామాజిక కార్యకర్త మాలకొండా రెడ్డి మాట్లాడుతూ ఆంధ్ర రాష్ట్ర ఆవిర్భావానికి మూలకారణమైన అమరజీవి పొట్టి శ్రీరాములు త్యాగాన్ని ప్రత్యేకంగా స్మరించుకున్నారు. తెలుగు ప్రజలకు ప్రత్యేక రాష్ట్రం సాధించడం కోసం పొట్టి శ్రీరాములు చేసిన 58 రోజుల ఆమరణ నిరాహార దీక్ష, ఆయన ఆత్మబలిదానమే చారిత్రక ఆంధ్ర రాష్ట్రం 1953 అక్టోబర్ 1 ఆవిర్భావానికి దారితీసింది అన్నారు. ఆ మహనీయుడి త్యాగం మనకెప్పటికీ స్ఫూర్తిదాయకం అని వారు తమ ప్రసంగాల ద్వారా తెలిపారు.రాష్ట్ర సాధన కోసం జరిగిన పోరాటాలు, మహనీయుల త్యాగాలను స్మరించుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందని చెప్పారు. గ్రంథాలయ అధికారి బొమ్మల కోటేశ్వరి మాట్లాడుతూ, ప్రతి ఒక్కరూ చరిత్రను, సంస్కృతిని తెలుసుకోవడానికి పుస్తక పఠనాన్ని అలవాటు చేసుకోవాలని కోరారు. పాఠకులు రమణ కుమ్మర తన ప్రసంగంలో ఆంధ్ర రాష్ట్ర ఆవిర్భావ చరిత్రపై యువతకు అర్థమయ్యేలా వివరించారు. ఈ కార్యక్రమంలో సచివాలయ ఉద్యోగులు కే. బాబు, ఎస్.కే. షాహేల, వి. శివశంకర్, ఎస్.డి. ఫయిజ్ మరియు పాఠకులు తదితరులు పాల్గొన్నారు.

## కావలికి 'మొంధా సైక్లోన్ ఫైటర్' అవార్డు...

### ముఖ్యమంత్రి చేతుల మీదుగా పురపాలక కమిషనర్ జి.శ్రావణ్ కుమార్ అభినందన పత్రం స్వీకరణ...

**కావలి :పెన్ పవర్ -(ఆర్సీ ఇంచార్జ్) నవంబర్ 1**



'మొంధా' తుఫాను నేపథ్యంలో కావలి పురపాలక సంఘం ముందస్తుగా, సమర్థవంతంగా తీసుకున్న చర్యలకు రాష్ట్ర ప్రభుత్వం నుంచి విశేష ప్రశంస లభించింది. శనివారం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు చేతుల మీదుగా కావలి పురపాలక సంఘ కమిషనరు జి.శ్రావణ్ కుమార్ ముఖ్యమంత్రి క్యాంప్ కార్యాలయంలో "మొంధా సైక్లోన్ ఫైటర్" అవార్డును అందుకున్నారు. తుఫాను ప్రభావం తో ఎలాంటి ఆస్తి నష్టం, ప్రాణ నష్టం జరగకుండా కట్టుదిట్టమైన చర్యలు చేపట్టినందుకుగాను ముఖ్యమంత్రి ఈ సందర్భంగా కమిషనర్‌ను ప్రత్యేకంగా అభినందించారు. ఈ ప్రశంసా పత్రాన్ని అందుకున్న అనంతరం కమిషనర్ జి.శ్రావణ్ కుమార్ మాట్లాడుతూ ఈ అవార్డు పురపాలక సంఘం సిబ్బంది, వార్డు సచివాలయాల కార్యదర్శులు, మరియు ప్రజలందరి సహకారానికి దక్కిన గౌరవంగా భావిస్తున్నట్లు తెలిపారు. మొంధా తుఫాను వల్ల ఏర్పడే ముప్పును ఎదుర్కోవడానికి ముందస్తు చర్యలు తీసుకోవడంలో అహర్నిశలు శ్రమించిన పురపాలక సంఘంలోని అన్ని విభాగాల సిబ్బందికి, అన్ని సచివాలయాల వార్డు సెక్రటరీలకు, మరియు అత్యవసర సమయంలో సహకరించిన పురపాలక ప్రజలందరికీ ఆయన తన హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు. ప్రజల భద్రతే ముఖ్యం అనే లక్ష్యంతో పనిచేసినందుకు ఫలితం దక్కిందని ఆయన సంతోషం వ్యక్తం చేశారు.

## అమరజీవి పొట్టి శ్రీరాములు అసలైన అహింసా యోధుడు



**పలమనేరు,పెన్ పవర్, నవంబరు 01,**

ఆంధ్రరాష్ట్రం ను సాధించిన తెలుగు వీరుడు మన ఆంధ్రులుగా తెలుగు వారుగా విశాలాంధ్రులుగా నేడు ప్రపంచమంతా విస్తరించి సగర్వంగా జీవిస్తున్నామంటే దానికి మూల పురుషుడు ఆంధ్రధీరుడు పొట్టి శ్రీరాములు శ్రీరాములు అని పట్టణ స్వచ్ఛంద సేవాకార్యకర్త మధుమోహన్ రావ్ అన్నారు.పొట్టి శ్రీరాములు జయంతి వేడుకలను గంగవరం మండలం కీలపట్లలోని అన్నం సొసైటీ నిర్వాహకులు శ్రీధర్ స్వామి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా అయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన చూపిన బాటలో నడుస్తూ తెలుగు వారి సంస్కృతి సంప్రదాయాలును కాపాడుకుంటూ వాటిని మనభావితరాలకు అందించడం మన అందరి బాధ్యత అని అన్నారు.ఇందులో స్వచ్ఛంద సేవా కార్యకర్తలు నందగోపాల్,యువరాజ్ ఢిల్లీ ప్రసాద్,వెంకటేష్ సుబ్రహ్మణ్యం,భక్తులు పాల్గొన్నారు.

## బుచ్చిరెడ్డిపాలెం మార్కెట్ త్వరలోనే ప్రారంభిస్తాం ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి





**బుచ్చిరెడ్డిపాలెం పెన్ పవర్ నవంబర్.1**

బుచ్చి.మున్సిపాలిటీలో త్వరలో ప్రారంభం కాబోతున్న నూతనంగా నిర్మించిన కూరగాయల మార్కెట్ భవనాన్ని గౌరవనీయులైన కోవూరు శాసనసభ్యురాలు శ్రీమతి వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి గారితో కలిసి, పరిశీలించిన బుచ్చిరెడ్డిపాలెం మున్సిపల్ చైర్ పర్సన్ మోర్ల సుప్రజా మురళి గారు.. అదేవిధంగా నూతనంగా నిర్మిస్తున్న మున్సిపల్ ఆఫీస్ భవన నిర్మాణ పనులను ఎమ్మెల్యే గారితో పాటు మున్సిపల్ చైర్ పర్సన్ గారు పరిశీలించడం జరిగింది... ఈ కార్యక్రమంలో చైర్పర్సన్ తో పాటు మున్సిపల్ కమిషనర్ డి బాలకృష్ణ, వైస్ చైర్మన్లు, ఎరటపల్లి శివకుమార్ రెడ్డి, పటాన్ నస్రిన్, కౌన్సిలర్లు, టౌన్ అధ్యక్షులు గుత్తా శ్రీనివాసులు ,టిడిపి నాయకులు, పాల్గొన్నారు.

# మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణ వ్యతిరేకిస్తూ కోటి సంతకాల సేకరణ..

## విద్య,వైద్యంను దూరం చేస్తున్న కూటమి ప్రభుత్వం -మాజీ ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య





**పెళ్లకూరు, పెన్ పవర్, నవంబర్ 1**

గత వైఎస్ఆర్సిపి ప్రభుత్వం నిర్మించిన ప్రభుత్వమెడికల్ కాలేజీల ప్రైవేటీకరణ నిర్ణయానికి వ్యతిరేకంగా శనివారం చావాలి పంచాయతీలలో కోటి సంతకాల సేకరణ కార్యక్రమం మండల కన్వీనర్ ఓబ్బు వెంకటరత్నం ఆధ్వర్యంలో నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిలుగా సూళ్లూరుపేట మాజీ శాసనసభ్యులు కిలివేటి సంజీవయ్య. వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షులు కామిరెడ్డి సత్యనారాయణరెడ్డి పాల్గొని రచ్చబండ కార్యక్రమం నిర్వహించి ప్రతి ఇంటికి పోయి కోటి సంతకాలు సేకరించారు.ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం సాగిస్తున్న అరాచకాలు,అన్యాయాలతో పాటు వైద్య విద్యను పేద ప్రజలకు కూటమి ప్రభుత్వం దూరం చేస్తుందని అని తెలిపారు.ఎంతో ప్రతిష్టాత్మకంగా పేద పిల్లలకు వైద్య విద్యను అందించాలని సదుద్దేశంతో జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వంలో జగన్మోహన్ రెడ్డి 17 మెడికల్ కాలేజీలను తీసుకురావడం జరిగిందని తెలిపారు.వాటిలో ఐదు మెడికల్ కాలేజీలు పూర్తిచేసి మిగిలిన 12 మెడికల్ కాలేజీలలు నిర్మాణ దశలో ఉన్న సమయంలో కూటమి ప్రభుత్వం పేద ప్రజలపై కక్ష గట్టి పిపిపి విధానంలో ప్రైవేటీకరణకు పూను కోవడంతో మెడికల్ కాలేజీలను ప్రైవేటు పరం చేయాలని కూటమి ప్రభుత్వం నిర్ణయాన్ని రాష్ట్రవ్యాప్తంగా వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ భారీ స్థాయిలో ప్రజా ఉద్యమాన్ని ప్రారంభించింది.ఈ నేపథ్యంలో కోటి సంతకాల సేకరణ కార్యక్రమం రాష్ట్రవ్యాప్తంగా ప్రతి గ్రామ సచివాలయాల స్థాయిలో పార్టీ కార్యకర్తలు నాయకులు ముందుకు వచ్చి సంతకాలు సేకరించాలని తెలిపారు.ప్రజల ఆరోగ్యం మన హక్కుని దానిని మార్కెట్ చేయడం అన్యాయమని తెలిపారు.విద్య,వైద్య రంగాలు ప్రజాసేవలుగా కొనసాగాలని వారు పునరుద్ఘాటించారు. పేద ప్రజలకు మెరుగైన వైద్యం.నిరుపేద విద్యార్థులకు వైద్య విద్యను అందించే అవకాశం ఉన్న కూటమి ప్రభుత్వ%ళి% మెడికల్ కాలేజీలను ప్రైవేటు వ్యక్తులకు అప్పగించడం దారుణం అని అన్నారు.జగనన్న పాలనలో చదువుకుంటున్న బిడ్డలకు అమ్మఒడి 80 లక్షల మందికి అందించారు కూటమి ప్రభుత్వంలో 40 లక్షల మందికి మాత్రమే అమ్మఒడి ఇచ్చి పేదోళ్ల కడుపు కొట్టారని తెలిపారు.బడుగు బలహీనవర్గాలతో పాటు విద్యార్థులందరికీ ఉచితంగా వైద్య విద్య అభ్యసించేందుకు జగన్మోహన్ రెడ్డి వీలు కల్పించారని తెలిపారు.పేదలకు అన్యాయం చేస్తున్న కూటమి ప్రభుత్వంపై చేపట్టిన కోటీ సంతకాల సేకరణ లో భాగంగా ప్రజలను భాగస్వామ్యం చేయాలని సూచించారు. తదుపరి కామిరెడ్డి సత్యనారాయణరెడ్డి మాట్లాడుతూ జగన్మోహన్ రెడ్డి ముఖ్యమంత్రి అయిన తర్వాత ప్రతి పేద విద్యార్థులను ఉన్నతమైన విద్య అందించాలని 17 మెడికల్ కాలేజీలను ప్రవేశపెట్టిన ఘనత జగన్మోహన్ రెడ్డి అని తెలిపారు.కూటమి ప్రభుత్వం మెడికల్ కాలేజీలను ప్రైవేటు కరణ చేసి ప్రైవేటు వ్యక్తులకి అప్పగించి కోట్లు రూపాయలు దోచుకోవాలని అనే ఆలోచనతో చంద్రబాబు నాయుడు పేదోళ్ల కడుపు కొట్టి దుర్మార్గపు పాలన సాగిస్తున్నాడని తెలిపారు ప్రతి గ్రామంలో కార్యకర్తలు కలిసికట్టుగా శాంతకాలు సేకరించి మాజీ ఎమ్మెల్యే కి అప్పగిస్తే సంతకాల సేకరించిన పత్రాలను జగన్మోహన్ రెడ్డికి అందిస్తారు జగన్మోహన్ రెడ్డి కోటి సంతకాల సేకరించిన పత్రాలను గవర్నర్కు అందించి మెడికల్ కాలేజీల ప్రైవేట్ కరణ ను అడ్డుకోవచ్చని తెలిపారు.ఈ కార్యక్రమంలో జడ్పిటిసి నన్ను%ళి% ప్రిష్కిల్లా వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర బీసీ సెల్ అధ్యక్షుడు యాళ్ళ మోహన్,యువజన విభాగ అధ్యక్షులు సాగి జితేంద్ర, టెడ్ యూనియన్ ప్రెసిడెంట్ పసల. వెంకయ్య , ఎంపీటీసీ శ్యామలమ్మ, ఎస్సీ సెల్ అధ్యక్షులు మల్లం. సురేష్,కామి రెడ్డి.గోవర్ధన్ రెడ్డి,చింతకాని మధుసూదన్ నాయుడు, నెలవల. తిరుపతయ్య, మెర్ల పాక.హర్షవర్ధన్, బత్తల. శీనయ్య, మనుబోలు. గోపి, సూళ్లూరు.బాలకృష్ణయ్య, పి. ప్రకాష్ వైఎస్ఆర్సిపి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఎమ్మెల్యే డా.నెలవల విజయశ్రీ ను సన్మానించిన టిడిపి నేత కట్టా వెంకటరమణారెడ్డి..





**నాయుడుపేట, పెన్ పవర్, నవంబర్ 1**

సూళ్లూరుపేట ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయశ్రీ టిడిపి నేత కట్టా వెంకటరమణారెడ్డి ఘనంగా సన్మానించారు.అలాగే నాయుడుపేట ఏఎంసీ చైర్మన్ జనసేన పార్టీ సూళ్లూరుపేట నియోజకవర్గ ఇన్చార్జ్ ఉయ్యాల ప్రవీణ్ ను సన్మానించారు. శనివారం ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయశ్రీ స్థానిక కూటమి పార్టీ నాయకులతో కలిసి నాయుడుపేట మున్సిపాలిటీ పరిధిలోని లోతువానిగుంటలో ఎన్టీఆర్ భరోసా సామాజిక ఫంక్షలనుఎన్టీఆర్ భరోసా సామాజిక పింఛన్లను పంపిణీ చేశారు.అలాగే నాయుడుపేట పిఎసిఎస్ గోదాంలో రైతులకు యూరియా బస్తాలను పంపిణీ చేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయశ్రీ,ఏఎంసీ చైర్మన్ ఉయ్యాల ప్రవీణ్ లకు తెలుగుదేశం పార్టీ నాయకులు కట్టా వెంకటరమణారెడ్డి శాలువాలు కప్పి ఘనంగా సన్మానించారు.ఈ సందర్భంగా టిడిపి నేత కట్టా వెంకటరమణారెడ్డి మాట్లాడుతూ మాజీ ఎంపీ నెలవల సుబ్రహ్మణ్యం కుమార్తె ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయశ్రీ తండ్రికి తగ్గ తనయగా నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తున్నారని తెలియజేశారు.మొంథా తుఫాను ప్రభావంతో నియోజకవర్గంలోని తీర ప్రాంతంలో నష్టపోయిన ప్రతి ఒక్కరిని ఆదుకునేందుకు ప్రణాళికాబద్ధంగా పనిచేస్తున్నారని కొనియాడారు.నియోజకవర్గంలోని సూళ్లూరుపేట,నాయుడుపేట మున్సిపాలిటీలను ఆదర్శవంతంగా తీర్చిదిద్దేందుకు కోట్లాది రూపాయల నిధులను మంజూరు చేయించారని తెలియజేశారు.ఈ కార్యక్రమంలో పలువురు తెలుగుదేశం పార్టీ నాయకులు పాల్గొన్నారు.

# బుచ్చిరెడ్డిపాళెం పట్టణంలోని బెజవాడ బుజ్జమ్మ బాలికొన్నతో పాఠశాల



**బుచ్చిరెడ్డిపాలెం పెన్ పవర్ నవంబర్ 1.**

విద్యార్థులు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. అండర్ 17 హ్యాండ్ బాల్ క్రీడల్లో పదో తరగతి చదువుతున్న లహరి, అండర్ 17 నెట్ బాల్ తొమ్మిదో తరగతి చదువుతున్న మోక్షిత, అండర్ 14 నెట్ బాల్ తొమ్మిదో తరగతి చదువుతున్న సాహితీ, గీతిక ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయురాలు సుజాత తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులను అభినందించారు. అనంతరం పిఈటి ఉపాధ్యాయురాలు ప్రవీణ బాబాయి చంద్రహాస వర్మ వర్ధంతి సందర్భంగా 20 మంది విద్యార్థులకు క్రీడా దుస్తులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మండల విద్యాశాఖ అధికారి 2 రత్నం పాల్గొని విద్యార్థులకు పంపిణీ చేశారు. అనంతరం ప్రధానోపాధ్యాయురాలు సుజాత మాట్లాడుతూ రాష్ట్ర స్థాయి క్రీడలకు ఎంపికైన విద్యార్థులు క్రీడల్లో ప్రతిభ కనబరిచి పాఠశాలకు మంచి పేరు తేవాలని కోరారు. విద్యార్థులు క్రీడలపై మక్కువ చూపాలన్నారు. విద్యార్థులకు క్రీడల్లో ప్రోత్సహిస్తున్న పి.ఈ టి ఉపాధ్యాయులను ప్రశంసించారు. విద్యార్థులకు క్రీడా దుస్తులు పంపిణీ చేసిన వారి కుటుంబ సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు.

# ఆక్రమణదారుల హస్తాల్లోకి కోట్ల విలువైన పిఓబి భూములు..

## ప్రేక్షక పాత్రలో రెవెన్యూ అధికారులు





**దొరవారిసత్రం, పెన్ పవర్, నవంబర్ 1**

దొరవారి సత్రం, జాతీయ రహదారుల సమీపంలో ఉన్న ప్రభుత్వ భూములకు రక్షణ లేకుండా పోయింది. పరపతి, పలుకుబడి ఉన్న నాయకులు ప్రభుత్వ భూములను వారి స్వాధీనంలోకి తీసుకుంటున్నారు. దొరవారి సత్రం మండల పరిధిలో క్రమేపీ ప్రభుత్వ భూములు కనుమరుగవుతున్నాయి. రెవిన్యూ అధికారుల నిర్లక్ష్యం నిలువెత్తు నిదర్శనంగా కనిపిస్తోంది. భూ ఆక్రమణదారులు అనాదీనం, అసైన్డ్, పోరంబోకు, మేత భూములను సైతం భూ బకాసురులు ఎవరికివారుగా ఆక్రమించుకుంటున్న కట్టడి చేయాల్సిన రెవెన్యూ యంత్రాంగం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారు. ఇదే క్రమంలో ప్రభుత్వం పి ఓ బి ( ప్రొహిబిషన్ ఆర్డర్ బుక్) నిషేధిత భూముల జాబితాలో ఉన్న కోట్ల రూపాయల విలువైన నెల బల్లి గ్రామంలో సర్వే నంబర్ 7 లోని భూమి ఆ గ్రామంలోని ఓ నాయకుడు ఆక్రమించి సాగు చేసేందుకు సిద్ధం అవుతున్నారు. జాతీయ రహదారికి అతి సమీపంలో ఉన్న నిషేధిత భూమిని ఆ గ్రామంలోని కొందరు పలు పర్యాయాలు ఆక్రమించడం మండల రెవెన్యూ అధికారులు వెళ్లి బోర్డులు పెట్టడమే కానీ ఆక్రమణదారులను పూర్తిస్థాయిలో కట్టడి చేయలేకపోతున్నారు. గత నెల క్రితం తాసిల్దార్, వీఆర్వో, సర్వేయర్, సర్వే నంబర్7లో సర్వే చేసి గనుమలు తొలగించి హెచ్చరిక బోర్డును ఏర్పాటు చేశారు. అయితే ఆ గ్రామానికి చెందిన ఆక్రమణదారులు మళ్లీ పొలం సాగుకు సన్నద్ధమవుతున్నారు. రెవెన్యూ అధికారుల నిషేధిత బోర్డులు ఏర్పాటుచేసిన, వాటిని బేఖాతర చేస్తూ, యంత్రాలతో దున్నకాలు చేపట్టారు. నెల బలి గ్రామానికి చెందిన నాయకులంటూ చలామణి అవుతున్న కొందరు రెవెన్యూ అధికారుల ఆదేశాలు ధిక్కరిస్తూ, ఎవరు ఏం చేస్తారన్న ధీమాలో వారు అనుకున్న లక్ష్యాలను నెరవేర్చే దిశలో పావులు కదుపుతున్నారు. వారికి పరిపాలన పార్టీ ప్రధాన నాయకుల అండ దండలు ఉన్నాయా! అధికారులను ఆకట్టుకుని సాగుకు సిద్ధమవుతున్నారా అన్న విమర్శలు ఆ గ్రామంలో వినిపిస్తున్నాయి. నిబంధనల ప్రకారం ఏ ప్రభుత్వ భూమిని ఆక్రమించిన చట్టరీత్యా నేరంగా పరిగణిస్తారు. అయితే సరాసరి నిషేధిత భూములను ఆక్రమించి సాగుకు యత్నిస్తున్నారంటే వారి వెనుక బలమైన రాజకీయ నేతల హస్తం ఉందా అనే అనుమానాలు కూడా ఆ గ్రామ ప్రజలు వ్యక్తపరుస్తున్నారు. ఏది ఏమైనా ప్రభుత్వ అధికారులుగా ఇలాంటి ఆక్రమణదారులపై మండల రెవెన్యూ అధికారులు ఎందుకు చర్యలు చేపట్టక పోతున్నారు, దీని వెనుక మర్మం ఏమిటి అన్నది ప్రజల ఆరోపణలు గా ఉన్నాయి. పలు పర్యాయాలు ఈ సంఘటనలో జిల్లా, డివిజన్ అధికారులకు కూడా తెలిసిన ఎందుకు ప్రతి చర్య తీసుకోలేకపోతున్నారన్నది ఆ గ్రామ ప్రజల ప్రశ్నగా ఉంది. రెవెన్యూ అధికారులు వారి అధికారాలతో నెలబల్లిలో ఆక్రమణకు నిషేధిత రక్షణ బాధ్యత తక్షణ చర్యగా చేపట్టాలని ఆ గ్రామ ప్రజలు కోరుతున్నారు.

# అంగన్వాడీ కేంద్రానికి వంటసామాగ్రి వితరణ



**పలమనేరు,పెన్ పవర్, నవంబరు 01**

నియోజకవర్గ పరిధిలోని గంగవరం మండల కేంద్రం పరిధిలోని మోతుకులపల్లి,బీడీ కాలనీ అంగన్వాడి కేంద్రానికి దాతలు వంటసామాగ్రి అందించారు.శనివారం ఈమేరకు పట్టణానికి చెందిన దాత శ్రీపురం సీతారామయ్య నాగమణి చారిటబుల్ ట్రస్ట్ తరపున అంగన్వాడీ లోని 20మంది విద్యార్థులకు అవసరమైన వంటపాత్రలతో బాటు భోజన ప్లేటు,గ్లాసులను అంగన్వాడీ కార్యకర్త భ్రమరాంబ కు ఆయన అందించారు.ఈసందర్భంగా ఆయనకు ఆమె కృతజ్ఞతలు తెలియజేశారు.

# సామాజిక పెన్షన్ల పంపిణీలో మున్సిపల్ కమీషనర్



**పలమనేరు,పెన్ పవర్, నవంబరు 01**

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వము మరియు జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు మున్సిపల్ కమీషనర్ రమణారెడ్డి ఆధ్వర్యంలో శనివారం అన్నివార్డు సచివాలయ సెక్రెటరీలు ద్వారా నవంబరు నెల పెన్షన్లు ఉదయము 6గంటల నుండే పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సచివాలయ ఉద్యోగుల ద్వారా సాధ్యమైనంత త్వరగా లబ్దిదారుల ఇంటి ఇంటికి వెళ్లి పంపిణీ వంద శాతం పూర్తి చేయాలని ఆదేశించామన్నారు. కాగా మొత్తము పెన్షన్లు 4517 కు గాను 4356 మంది లబ్దిదారులకు 96.44శాతం పంపిణీ శనివారం పూర్తి చేశామని ఆయన అన్నారు.

# రాష్ట్రస్థాయి లాన్ టెన్నిస్ పోటీలను ప్రారంభించిన సాప్ చైర్మన్ అనిమిని రవి నాయుడు.







**శ్రీకాళహస్తి ,పెన్ పవర్ ,నవంబర్ 1 :**

శ్రీకాళహస్తిలో విక్రం టెన్నిస్ అకాడమీ నందు ప్రారంభించిన సాప్ చైర్మన్ అండర్ 14 అండర్ 17 మరియు అండర్ 19 పోటీలను ఘనంగా షాప్ చైర్మన్ అని రవి నాయుడు ప్రారంభించడం జరిగింది.ఈ పోటీలలో ఉమ్మడి 13 జిల్లాల నుంచి జిల్లాకు 30 మంది చొప్పున 390 మంది క్రీడాకారులు రాష్ట్ర నలుమూలల నుంచి శ్రీకాళహస్తికి విచ్చేయడం జరిగింది .ఈ పోటీలలో గెలుపొందిన క్రీడాకారులు వచ్చే నెల ఢిల్లీలో జరిగే జాతీయస్థాయి పోటీలలో పాల్గొంటారు,కాబట్టి ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా రాష్ట్ర ఆంధ్రప్రదేశ్ స్కూల్ గేమ్ ఫెడరేషన్ కార్యదర్శి శ్రీ భానుమూర్తి,పట్టణ టిడిపి అధ్యక్షులు విజయకుమార్, చెంచయ్య నాయుడు శ్రీకాళహస్తి క్లబ్ కార్యదర్శులు బి జె ప్రసాద్,మన్మథ రావు ,విక్రమ్ అకాడమీ చైర్మన్ ప్రవీణ్ ,ఇతర టిడిపి పటం నాయకులు ఈ కార్యక్రమంలో పాల్గొనడం జరిగింది.ఈ కార్యక్రమాలన్నీ జిల్లా స్కూల్ గేమ్ కార్యదర్శి కిషోర్ కుమార్ మరియు భార్గవి,సమక్షంలో నిర్వహించడం జరిగింది. పౌండర్ డా. ప్రవీణ్, ఇతర టిడిపి పటం నాయకులు ఈ కార్యక్రమంలో పాల్గొనడం జరిగింది.

# సాతులూరులో పోలీసుల కార్డెన్ సెర్చ్

### మారణాయుధాలు, వాహనాలు సీజ్ చేసిన డీఎస్పీ హనుమంతరావు





**చిలకలూరిపేట రూరల్, పెన్ పవర్, నవంబర్ 01:**

నాదెండ్ల: డీఎస్పీ హనుమంతరావు పర్యవేక్షణలో మండలంలోని సాతులూరు గ్రామంలో పోలీసులు విస్తృత స్థాయిలో కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. పోలీసులు ఇంటింటికి వెళ్లి ప్రతి గృహాన్ని, పరిసర ప్రాంతాలను క్షుణ్ణంగా తనిఖీ చేశారు. ఈ తనిఖీల్లో సరైన పత్రాలు లేని 28 ద్విచక్ర వాహనాలు సీజ్ చేయడంతో పాటు గొడ్డళ్లు, కొడవళ్లు, పలుగులు వంటి మారణాయుధాలను పెద్ద మొత్తంలో స్వాధీనం చేసుకున్నారు. ఈ విస్తృత తనిఖీల్లో చిలకలూరిపేట రూరల్ సీఐ సుబ్బరాయుడు, చిలకలూరిపేట అర్బన్ సీఐ రమేష్, పలువురు ఎస్ఐలతో పాటు 70 మంది పోలీసులు పాల్గొన్నారు.పోలీసులు శాంతిభద్రతల పరిరక్షణలో భాగంగా, నేర కార్యకలాపాలను అరికట్టడానికి ఈ కార్డెన్ సెర్చ్ నిర్వహించినట్లు తెలుస్తోంది. సరైన పత్రాలు లేని వాహనదారులపై, అలాగే అక్రమంగా మారణాయుధాలు కలిగి ఉన్న వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని అధికారులు హెచ్చరించారు.

# చిలకలూరిపేటలో ఆంధ్రప్రదేశ్ అవతరణ దినోత్సవం

### ముఖ్యఅతిథిగా రిటైర్ ఎక్సైజ్ సీఐ గోరంట్ల నారాయణ



**చిలకలూరిపేట రూరల్, పెన్ పవర్, నవంబర్ 01:**

పట్టణంలోని శాఖా గ్రంథాలయంలో శనివారం ఆంధ్రప్రదేశ్ అవతరణ దినోత్సవ కార్యక్రమం జరిగింది. జ్ఞానేశ్వరి అర్బన్ అండ్ రూరల్ డెవలప్మెంట్ సొసైటీ (గార్డ్స్) మరియు గ్రంథాలయ అభివృద్ధి కమిటీ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా రిటైర్డ్ ఎక్సైజ్ సీఐ గోరంట్ల నారాయణ పాల్గొన్నారు, ఆంధ్రరాష్ట్రం కోసం అమరజీవి పొట్టి శ్రీరాములు చేసిన ఆమరణ నిరాహార దీక్ష గురించి మాట్లాడారు. పొట్టి శ్రీరాములు ను గుర్తుంచుకోవడం ప్రతి ఆంధ్రుడి బాధ్యత అన్నారు. తొలుత పొట్టి శ్రీరాములు చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం చౌత్ర సెంటర్ ఆంజనేయ స్వామి గుడి వద్ద ఉన్న విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో గార్డ్స్ ఉపాధ్యక్షులు గేరా యాకోబు, సలహాదారులు దాసరి చిట్టిబాబు, గ్రంథాలయ అభివృద్ధి కమిటి కార్యదర్శి డా.దార్ల బుజ్జిబాబు, డా.పీవీ సుబ్బారావు, తో పాటు గ్రంథాలయ అభివృద్ధి కమిటీ సభ్యులు సిద్ధాంతి కరిముల్లా, గ్రంథాలయ ఇంచార్జి అధికారి. డి.వీర్రాజు, బి.అజయ్ బాబు, శ్రీవినాయక ట్రస్ట్ చైర్మన్ చంద్రపట్ల మణి కుమార్, గ్రంథాలయ సిబ్బంది పాల్గొన్నారు.

# చీరాల మున్సిపాలిటీలో మరో వివాదం



**చీరాల, పెన్ పవర్ నవంబర్ 01**

చీరాల మున్సిపాలిటీలో అంతర్గత విభేదాలు మళ్లీ ఉధృతమయ్యాయి. శుక్రవారం కౌన్సిల్ సమావేశం కోరం లేక వాయిదా పడిన విషయం తెలిసిందే. అయితే, శనివారం రాష్ట్ర అవతరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని మున్సిపల్ కార్యాలయంలో నిర్వహించిన అధికారిక కార్యక్రమం మరో వివాదానికి దారి తీసింది. చైర్మన్ గానీ, కమిషనర్ గానీ కౌన్సిలర్లకు ఆహ్వానం పంపకుండా వారే కార్యక్రమాన్ని నిర్వహించడం కౌన్సిలర్ల ఆగ్రహానికి గురైంది. కార్యక్రమం తూతూ మంత్రంగా జరిపించారని వారు ఆరోపించారు. అధికారుల తీరుపై అసహనం వ్యక్తం చేసిన కౌన్సిలర్లు, ఈ విషయంపై జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామని హెచ్చరించారు. స్థానిక మున్సిపాలిటీలో జరుగుతున్న ఈ తరహా పరిణామాలు ప్రజాప్రతినిధులు మరియు అధికారుల మధ్య ఉన్న విభేదాలను మరోసారి బహిర్గతం చేశాయి.

# పొలాలలో నిలిచిన నీటిని తొలిగించుటకు వెంటనే చర్యలు తీసుకోవాలి

### మూడు రోజులైనా నీటి లో ఉన్న వరి పొలాలను నమోదు చేయాలి -జిల్లా కలెక్టర్ డాక్టర్ వి.వినోద్ కుమార్







**పెన్ పవర్ బ్యూరో బాపట్ల నవంబర్ 1**

తుఫాన్ ప్రభావంతో పొలాల లో నిలిచిన నీటి వెంటనే తొలిగించే ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ వి.వినోద్ కుమార్ ఇరిగేషన్ అధికారులను ఆదేశించారు. శనివారం చిన్న గంజాం మండలం,కడవకుదురు,గొనసపూడి గ్రామాల సమీపంలో మొ%ళి%తా తుఫాన్ ప్రభావంతో నీటి మునిగిన వరి పొలాలను,కొమ్మూరు, రొంపేరు కాల్వను చీరాల రెవెన్యూ అధికారి చంద్రశేఖర్ నాయుడు తో కలసి పరిశీలించారు. ముందుగా కడవకుదురు గ్రామం సమీపాన నీటి లో మునిగి పోయిన వరి పొలాలను పరిశీలించారు.5896 ఎకరాలు వరి నీటి లోమునిగిందని, గత 5 రోజు అయిన నీరు తగ్గలేదని మండల వ్యవసాయ అధికారిణి కలెక్టర్ కు వివరించారు. మూడు రోజులు తర్వాత కూడా నీరు తగ్గకుంటే ఆ వరి పొలాలని నమోదు చేయాలని గ్రామ వ్యవసాయ అధికారిణి కలెక్టర్ ఆదేశించారు. రైతులు కూడా ఆలోచించి తమ పొలాలలో నిలిచిన నీటి తొలిగించుటకు అధికారులకు సహకరించాలని చూచించారు. పొలాలలో నిలిచిన నీటిని మోటార్స్ ద్వారా తొలిగిస్తున్నామని రైతులకు చూచించారు.. పొలాలలో నిలిచిన నీటి ఏవిధంగా తొలగించాలన్న ప్రణాళికలు తయారు చేయాలని, డ్రోన్స్ ను ఉపయోగించి ఎక్కడ నీటిని తొలగించే అవకాశం ఉంటే వెంటనే అక్కడ నుండి నీటిని తొలగించే ఏర్పాట్లు చేయాలని ఇరిగేషన్ అధికారుల ను ఆదేశించారు. రొంపేరు, కొమ్మూరు కాల్వల ద్వారా ప్రవహించే నీటి ఇరిగేషన్ అధికారులతో కలిసి పరిశీలించారు. జిల్లా కలెక్టర్ వెంట ఇరిగేషన్, వ్యవసాయ, ఉద్యాన శాఖల అధికారులు, తహశీల్దార్, యం పి డి ఓ మండల స్థాయి అధికారులు, రైతులు తదితరులు ఉన్నారు.

# ఆపదను అడ్డుకున్నారు

### సమర్ధతను చాటుకున్నారు బాధితుల సేవలో అధికార యంత్రాంగం కృషి భేష్..



**పెన్ పవర్ బ్యూరో బాపట్ల నవంబర్ 1**

బాపట్ల శాసనసభ్యులు వేగేశన నరేంద్ర వర్మ రాజు మొందా తుఫాను ప్రభావంతో బాపట్ల ప్రాంతంలో పంట పొలాల రైతులను, నష్టపోయిన బాధితులను ఆదుకుంటామని, శాసనసభ్యులు వేగేశన నరేంద్ర వర్మ రాజు అన్నారు. బాపట్ల ప్రాంతంలో ఎక్కడా కూడా ప్రాణ నష్టం జరగకుండా జిల్లా కలెక్టర్ వినోద్ కుమార్, ఎస్పీ ఉమామహేశ్వర్ సారధ్యంలో అధికారులు ఎంతో సమయస్ఫూర్తితో వ్యవహరించి తుఫాను బీభత్సాన్ని సమర్ధవంతంగా ఎదుర్కొన్నారని కొనియాడారు. తుఫానుతో తల్లడిల్లి పోయిన ప్రజానీకానికి కొండంత ధైర్యాన్ని ఇస్తూ జిల్లా కలెక్టర్ వినోద్ కుమార్ అనేక రాత్రులు జాగారం చేసి ఆదుకున్న సందర్భాలు కలెక్టర్ సమర్ధతకు నిలువుటద్దంగా నిలిచాయని నరేంద్ర వర్మ అన్నారు. ప్రకృతి కన్నెర్ర చేస్తే ఎన్నో ఇబ్బందులకు గురయ్యే తీర ప్రాంత గ్రామాల ప్రజలకు జిల్లా అధికార యంత్రాంగం ఇచ్చిన భరోసాతో తుఫాను ముప్పు నుండి బయటపడ్డారని అన్నారు. బాపట్ల ప్రాంతంలోని తెలుగుదేశం పార్టీ, జనసేన బిజెపి పార్టీల కార్యకర్తలు నాయకులు ప్రజలకు నిరుపమాన సేవలు అందించడంలో ఒక వేదికగా నిలిచారని అన్నారు. ఇంత పెద్ద బీభత్సం బాపట్ల ప్రాంతాన్ని కుదిపేసిన ఎక్కడ కూడా ప్రాణ నష్టం జరగకుండా తీసుకున్న చర్యలు సమర్ధతను చాటి చెప్పాయని నరేంద్ర వర్మ అన్నారు. బాపట్ల జిల్లా తుఫాను బీభత్సాన్ని ఎదురొడ్డి నిలబడి ఎదుర్కొన్న వైనం రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రశంసించేలా చేశాయని నరేంద్ర వర్మ అన్నారు. తుఫాను వల్ల నష్టపోయిన బాధితులకు అన్ని విధాల ఆదుకునేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని నరేంద్ర వర్మ చెప్పారు. బాపట్ల నియోజకవర్గంలో ఇప్పటికే వేలాదిమంది పునరావాస బాధితులకు ఆర్థిక సాయం నిత్యవసరాలు పంపిణీ చేయడం జరిగిందని వెల్లడించారు. నియోజకవర్గంలో నష్టపోయిన బాధితుల జాబితా సిద్ధం చేస్తున్నామని అన్నారు. పంట పొలాలు, ఉద్యాన పంటలు కోల్పోయిన రైతులకు ప్రభుత్వం సహకారాన్ని అందిస్తుందని తెలిపారు. ఏ ఒక్క రైతు కూడా ఇబ్బంది పడకూడదన్నది కూటమి ప్రభుత్వ ఏకైక లక్ష్యమని చెప్పారు. ప్రాణ నష్టం జరగకుండా చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి చంద్రబాబు సూచనలను బాపట్ల జిల్లా అధికార యంత్రాంగం నిరూపించి చూపించిందని నరేంద్ర వర్మ అన్నారు. కొన్ని ప్రాంతాల్లో పంటలు నష్టపోవడం, ఇళ్లు మునిగిపోవడం, మరికొన్ని వర్గాల ప్రజలు నష్టపోవటం వంటి సంఘటనలు కొంత ఆందోళన కలిగించినా మొత్తం మీద తుఫాను ప్రభావాన్ని అత్యంత ముందుచూపుతో జిల్లా అధికార యంత్రాంగం సమర్ధవంతంగా ఎదుర్కొందని నరేంద్రవర్మ అన్నారు. ఈ విషయంలో పూర్తిస్థాయిలో సేవలు అందించిన జిల్లా అధికార యంత్రాంగానికి, ప్రజా ప్రతినిధులకు, కూటమి నాయకులు కార్యకర్తలకు, స్వచ్ఛంద సేవా సంస్థలకు, ప్రభుత్వ విభాగాల్లోని వివిధ శాఖలకు, పోలీసు, మెరైన్, రెవెన్యూ, పంచాయతీరాజ్, ఇరిగేషన్ శాఖ,వివిధ మహిళా సంఘాల నిర్వాహకులకు,గ్రామీణ నీటి సరఫరా,ఎస్ డి ఆర్ ఎఫ్, ఎన్ డి ఆర్ ఎఫ్, వైద్య ఆరోగ్యశాఖ, గ్రామపంచాయతీల సిబ్బంది, వివిధ ప్రాంతాల్లో సేవలు అందించిన పారిశుద్ధ్య కార్మికులకు, పునరావాస కేంద్రాలకు సహకారాన్ని అందించిన సిబ్బందికి,బాపట్ల పురపాలక సంఘ సిబ్బందికి, రెడ్ క్రాస్ కార్యకర్తలకు,పాత్రికేయ మిత్రులకు, ఆపద సమయంలో ఆదుకొని సేవలు అందించిన ప్రతి ఒక్కరికి ఈ సందర్భంగా ఎమ్మెల్యే నరేంద్ర వర్మ రాజు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు.

# తుఫాను బాధిత కుటుంబాలకు అండగా నిలిచి, మానవత్వం చాటుకున్న - బలసాని.



**పెన్ పవర్,గుంటూరు జిల్లా, నవంబర్, 01**

ప్రత్తిపాడు నియోజకవర్గం, పెదనందిపాడు మండలం, గోగులమూడి గ్రామంలో, ఇటవల సంభవించిన తుఫాను కారణం వలన, నష్టపోయిన బాధిత కుటుంబాలకు ప్రభుత్వం నష్టపరిహారం అందించే విషయంలో, తమ పార్టీ వారు కాదు అని, ఆరు కుటుంబాలకు నష్టపరిహారం అందకుండా అడ్డుకున్న కూటమి నాయకులు. ఈ విషయం తెలుసుకున్న, ప్రత్తిపాడు నియోజకవర్గ వై.యస్.ఆర్ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి శ్రీ బలసాని కిరణ్ కుమార్" , బాధితు కుటుంబాలకు అండగా నిలిచి, ఆర్థిక సాయం అందించారు. ఈ సందర్భంగా బలసాని మాట్లాడుతూ, గతంలో ఎన్నడూ లేని విధంగా కూటమి ప్రభుత్వం కక్షపూరిత రాజకీయాలు చేస్తుందని మండిపడ్డారు, తుఫాన్ బాధితులకు ప్రభుత్వం తరపున వారికి అండగా నలవాల్సింది పోయి, కేవలం వారు వైసీపీకి ఓటు వేశారని వారికి అందవలసిన నష్టపరిహారాన్ని నిలిపివేశారు అని అన్నారు, గతంలో పార్టీ అధికారలో ఉన్నప్పుడు జగన్ మోహన్ రెడ్డి కులం, మతం, పార్టీ అనే బేధం లేకుండా ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాల అందించారు అని తెలిపారు. ఈ కార్యక్రమంలో, ప్రత్తిపాడు- తెనాలి నియోజకవర్గ పరిశీలకులు షేక్ గులాం రసూల్ , పెదనందిపాడు మండల కన్వీనర్ షేక్ ఖాసిం ఫీరా , గ్రామ నాయకులు అందులూరి వెంకటేశ్వరరావు గారు, తదితరులు పాల్గొన్నారు.

# జిఎంసి సేవలను అందించడంలో ప్రతిభ చూపిన నోడల్ అధికారి పఠాన్ కరిముల్లా...



**పెన్ పవర్, గుంటూరు, నవంబర్, 01.**

గుంటూరు నగరపాలక సంస్థ పరిధిలో మొంథా తుఫాన్ నేపథ్యంలో ప్రజలకు విస్తృతంగా జిఎంసి సేవలను అందించడంలో ప్రతిభ చూపిన నోడల్ అధికారి పఠాన్ కరిముల్లా ఖాన్ ని రాష్ట్ర ముఖ్యమంత్రి శనివారం తమ క్యాంప్ కార్యాలయంలో అభినందించారని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు తెలిపారు. శనివారం కరిముల్లా ఖాన్ ముఖ్యమంత్రి చేతుల మీదుగా అందుకున్న ప్రశంసాపత్రాన్ని కమిషనర్ కి అందించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ, మొంథా తుఫాన్ నేపథ్యంలో గుంటూరు నగరంలో వార్డ్ ల వారీగా నోడల్ అధికారులను నియమించామని, వారి ద్వారా నగర ప్రజలకు ముందస్తుగా తుఫాన్ ప్రమాదంపై అవగాహన కల్గించామన్నారు. పునరావాస కేంద్రాలను ఏర్పాటు చేసి, వారికి ఆహారం, త్రాగునీరు అందించామన్నారు. కేటాయించిన విధుల్లో ప్రజలకు మెరుగైన సేవలు అందించడంలో పఠాన్ కరిముల్లా ఖాన్ ని రాష్ట్ర ముఖ్యమంత్రి అభినందించారన్నారు. కరిముల్లా ఖాన్ తో పాటు తుఫాన్ ప్రభావిత ప్రాంతాల్లో విభాగాధిపతులు, నోడల్ అధికారులు, కార్పొరేటర్లు, సచివాలయ కార్యదర్శులు, ప్రజారోగ్య, ఇంజినీరింగ్ కార్మికులను కూడా జిఎంసి నుండి ప్రత్యేకంగా అభినందిస్తున్నామన్నారు.

# ఘనంగా ఆంధ్ర రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకలు





**కారంపూడి**

పల్నాడు జిల్లా కారంపూడి పట్టణంలోని గాంధీ బొమ్మ సెంటర్లో ఆర్యవైశ్య సంఘం ఆర్యవైశ్య యువజన సంఘం మరియు వాసవి జాగృతి క్లబ్ ఆధ్వర్యంలో ఆంధ్రరాష్ట్ర అవతరణ దినోత్సవం వేడుకలు ఘనంగా నిర్వహించారు. వారు మాట్లాడుతూ 1953 అక్టోబర్ 1న, మద్రాసు రాష్ట్రం నుండి తెలుగు మాట్లాడే 11 జిల్లాలను వేరు చేసి కర్నూలు రాజధానిగా ఆంధ్ర రాష్ట్రం ఆ తర్వాత, 1956 నవంబర్ 1న, హైదరాబాద్ రాష్ట్రంలోని తెలంగాణ ప్రాంతాన్ని ఇందులో విలీనం చేసి, హైదరాబాద్‌ను రాజధానిగా చేసుకొని ఆంధ్రప్రదేశ్ ఏర్పడింది. ఈ రెండు ముఖ్యమైన తేదీలు ఒక ప్రత్యేక రాష్ట్రం ఏర్పడటానికి దారితీసిన చారిత్రక ఘట్టమని ఆంధ్ర రాష్ట్ర అవతరణ పొట్టి శ్రీరాములు త్యాగ ఫలితం అని వారు అన్నారు. ఈ కార్యక్రమంలో మండల ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు ఎస్ పి ఆర్ కృష్ణ వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారి దేవస్థానం అధ్యక్షులు మద్దు హనుమంతరావు శ్రీ వాసవి అన్న ప్రసాదం కమిటీ ఫౌండర్ భవిరిశెట్టి రామారావు వాసవి ఆర్యవైశ్య యువజన సంఘం అధ్యక్షులు సముద్రాల పవన్ సాయి వాసవి జాగృతి క్లబ్ అధ్యక్షులు కరాలపాటి ఆదినారాయణ ఆర్యవైశ్య నాయకులు సన్నిధి జగన్ మోహన్ రావు,ఆతుకూరి గోపి, వెచ్చ వరలక్ష్మణరావు,పొట్టుమూర్తి నాగబాబు, చేపూరి రవీంద్ర, వెచ్చ వాసు, గుండా సుబ్బారావు, వెచ్చ నవీన్, సముద్రాల అరవింద్, చిన్ని లవ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# వేటపాలెం మండలంలో ఎంపీ తెన్నేటి కృష్ణ ప్రసాద్ పింఛన్ల పంపిణీ



**వేటపాలెం,పెన్ పవర్ నవంబర్ 01**

బాపట్ల పార్లమెంట్ సభ్యులు మరియు లోక్‌సభ ప్యానల్ స్పీకర్ తెన్నేటి కృష్ణ ప్రసాద్ శనివారం వేటపాలెం మండలం చల్లారెడ్డిపాలెం పంచాయతీ పరిధిలోని ఎస్.టి. కాలనీలో పింఛన్ల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీ కృష్ణ ప్రసాద్ లబ్ధిదారులకు పింఛన్లు స్వయంగా అందజేసి, వారి యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. లబ్ధిదారులతో మాట్లాడిన ఆయన వారి సమస్యలను శ్రద్ధగా విని, సంబంధిత అధికారులకు వాటి పరిష్కారానికి తగిన ఆదేశాలు జారీ చేశారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులందరికీ పారదర్శకంగా అందాలని, పేదల జీవితాల్లో మార్పు తీసుకురావడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని ఎంపీ కృష్ణ ప్రసాద్ స్పష్టం చేశారు. కార్యక్రమంలో వేటపాలెం తహసిల్దార్ గీతరాణి, ఎంపిడివో రాజేష్, సచివాలయ సిబ్బంది, కూటమి నాయకులు మరియు కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఇంచార్జీల కోసం కసరత్తు



**విజయవాడ, నవంబర్ 1, పెన్ పవర్:** వైసీపీ అధినేత వైఎస్ జగన్ కీలక నిర్ణయం తీసుకునే అవకాశాలు కనిపిస్తున్నాయి. త్వరలోనే ఇక నియోజకవర్గాలకు ఇన్ ఛార్జులను నియమిస్తారని పార్టీ వర్గాల నుంచి అందుతున్న సమాచారం.

ఇప్పటి వరకూ చాలా నియోజకవర్గాలకు ఇన్ ఛార్జులున్నారు. అయితే గత ఎన్నికల్లో నాడు మంత్రులుగా ఉన్న వారిని ఎమ్మెల్యేలను నియోజకవర్గాలను మార్చి కొత్త ప్రయోగానికి శ్రీకారం చుట్టారు. అయితే అలాంటి నియోజకవర్గాలకు వెళ్లి 2024 ఎన్నికల్లో ఓటమి పాలయిన నేతలు తమకు ఎన్నికల సమయంలో కేటాయించిన కొత్త నియోజకవర్గాలకు వెళ్లేందుకు ఆసక్తి చూపడం లేదు. జగన్ మాట కాదనకుండా కొందరు వెళుతున్నా మనస్ఫూర్తిగా అక్కడ క్యాడర్ తో మమేకం కావడం లేదు. ఈ విషయాలన్నీ వైసీపీ అధినేత దృష్టికి వచ్చినట్లు తెలిసింది. చాలా నియోజకవర్గాల్లో క్యాడర్ కు అందుబాటులో లేకపోవడం, కేవలం తనతో జరిగే సమావేశాలకు మాత్రమే హాజరవుతున్నారని గుర్తించారు. దీంతో క్యాడర్ కూడా అయోమయంలో పడింది. స్థానిక సంస్థల ఎన్నికలు వచ్చే ఏడాది ఆరంభంలోనే జరగనున్నాయి. ఇప్పటికే రాష్ట్ర ఎన్నికల కమిషన్ ఈ మేరకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది. స్థానిక సంస్థల ఎన్నికలకు సంబంధించిన ప్రక్రియ కూడా ఆంధ్రప్రదేశ్ లో ప్రారంభమయింది. ఈ పరిస్థితుల్లో నియోజకవర్గాల్లో ఇన్ ఛార్జులు యాక్టివ్ గా లేకపోతే స్థానిక సంస్థల ఎన్నికలలో సరైనోళ్లకు టిక్కెట్ ఇచ్చే అవకాశం ఉండదు. ఎవరో ఒకరికి సీట్లు కేటాయిస్తే పార్టీ రాజకీయంగా ఇబ్బందులు ఎదుర్కొంటుంది. . క్యాడర్ కూడా తమకు స్థానిక సంస్థల్లో అవకాశం దక్కుతుందని భావిస్తేనే యాక్టివ్ గా ఉంటారు. కానీ వారికి ఏ రకమైన హామీ ఇచ్చే నేత చాలా నియోజకవర్గాల్లో లేరు. అందుకే క్యాడర్ కూడా కొంత అయోమయంలో ఉంది. ఈ పరిస్థితుల్లో వైఎస్ జగన్ నవంబరు నెల తొలి వారంలో పార్టీని ప్రక్షాళన చేయాలని నిర్ణయించారని తెలిసింది. నియోజకవర్గాల ఇన్ ఛార్జులను తిరిగి నియమించే ప్రక్రియను ప్రారంభించనున్నారని చెబుతున్నారు. అప్పుడే క్షేత్రస్థాయిలో పార్టీ బలోపేతం అవుతుందని ఆయనకు నివేదికలు అందడంతో నేతలు ఇష్టాయిష్టాలను కనుక్కున్న తర్వాత మాత్రమే వారిని ఇన్ ఛార్జులుగా నియమించాలా? వద్దా? అన్నది నిర్ణయిస్తారన్నది అందుతున్న సమాచారాన్ని బట్టి తెలుస్తోంది.

## జేసీకి చెక్ దిశగా పావులు

**అనంతపురం, నవంబర్ 1, పెన్ పవర్:** తాడిపత్రి మున్సిపల్ ఛైర్మన్ జేసీ ప్రభాకర్ రెడ్డి పార్టీకి ఇబ్బందిగా మారారు. ఆయనపై అనంతపురం జిల్లా నేతలు కూడా చంద్రబాబు నాయుడుకు ఫిర్యాదు చేసినట్లు తెలిసింది. జేసీ ప్రభాకర్ రెడ్డి తీరు వల్ల జిల్లాలో పార్టీకి రాజకీయంగా ఇబ్బందిగా మారుతుందని చెప్పినట్లు సమాచారం. ఆయన తాడిపత్రి నియోజకవర్గంలోనే వివాదాస్పద వ్యాఖ్యలు చేస్తున్నప్పటికీ ఆ ప్రభావం జిల్లా పార్టీపై కూడా పడే అవకాశముందని చంద్రబాబు దృష్టికి కొందరు నేతలు తీసుకు వచ్చారు. ఆయనను కట్టడి చేయకుంటే... నోటికి తాళం వేయకుంటే పార్టీ జిల్లాల్లో ఇబ్బందులు పడుతుందని తెలిపారు. జేసీ ప్రభాకర్ రెడ్డి ఇతర నియోజకవర్గాల్లోనూ తలదూరుస్తున్నారని, ఒంగోలు కు వెళ్లి అక్కడ కూడా వివాదానికి కారణమయ్యారని చంద్రబాబు దృష్టికి కొందరు నేతలు తీసుకెళ్లినట్లు తెలిసింది. దీంతో తాడిపత్రి ఎమ్మెల్యే జేసీ అస్మిత్ రెడ్డిని పిలిచి త్వరలోనే ఆయనకు తగిన సూచనలు ఇవ్వాలని చంద్రబాబు భావిస్తున్నారు. మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి విషయంలో జేసీ ప్రభాకర్ రెడ్డి చేస్తున్న విషయాన్ని జిల్లా నేతలు కూడా పెద్దగా పట్టించుకోలేదు. తాడిపత్రి నియోజకవర్గంలోకి ఆయనను అడ్డుకోవడంతో పాటు పలు మార్లు ఆయనపై విమర్శలు చేసినా అది రెండు కుటుంబాల మధ్య జరుగుతున్న వైరంగానే భావించారు. కానీ ఆయన ఇటీవల ఐపీఎస్ అధికారి, ఏఎస్పీ రోహిత్ కుమార్ చౌదరిపై చేసిన వ్యాఖ్యలు పార్టీకి ఇబ్బందికరంగా మారాయి. దీనివల్ల టీడీపీ పై సాధారణ ప్రజల్లో ఒకరకమైన వ్యతిరకేత భావం ఏర్పడుతుందని చంద్రబాబు కు నేతలు చెప్పినట్లు తెలిసింది. . అయితే జేసీ ప్రభాకర్ రెడ్డిని కట్టడిని నేరుగా చేయాలంటే కష్టమేనని భావించిన చంద్రబాబు ఎమ్మెల్యే అస్మిత్ రెడ్డిని పిలిచి క్లాస్ పీకాలని భావిస్తున్నారు. బహుశ లండన్ పర్యటన నుంచి రాగానే అస్మిత్ రెడ్డిని తన వద్దకు పిలిపించుకుని మాట్లాడాలని చంద్రబాబు భావిస్తున్నారు. మరొకవైపు రోహిత్ కుమార్ చౌదరిని బదిలీ చేయాలని కూడా జేసీ ప్రభాకర్ రెడ్డి డిమాండ్ చేశారు. కానీ రోహిత్ చౌదరి పదవీకాలాన్ని మరో ఏడాది ప్రభుత్వం పొడిగించడం వెనక కూడా జేసీ నోటికి కళ్లెం వేయడానికేనని అంటున్నారు. మరో ఏడాదిపాటు తాడిపత్రి ఏఎస్పీగా కొనసాగేలా ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. అంతేకాకుండా ఎస్పీ కూడా జేసీ ప్రభాకర్ రెడ్డికి అపాయింట్ మెంట్ ఇవ్వకపోవడం వెనక ఆయనకు కూడా ప్రభుత్వ పెద్దల నుంచి స్పష్టమైన సంకేతాలు వచ్చినట్లేనన్నది తాడిపత్రిలో వినిపిస్తున్న టాక్.

## 5,250 కోట్ల నష్టం

## 4,794 కిలోమీటర్ల మేరకు రోడ్లు

## 1.38 లక్షల హెక్టార్లలో పంటలకు నష్టం

**విజయవాడ, నవంబర్ 1, పెన్ పవర్:** మొంథా తుఫానుతో కలిగిన నష్టంపై ఏపీ ప్రభుత్వం కేంద్రానికి నివేదిక అందించింది. తుఫాను వలన కలిగిన నష్టంపై ప్రాథమిక నివేదిక రూపొందించిన ఏపీ ప్రభుత్వం.. కేంద్ర ప్రభుత్వానికి నివేదిక అందజేసింది. తుఫాను కారణంగా రూ.5,244 కోట్ల మేర నష్టం కలిగినట్లు ప్రాథమికంగా అంచనా వేశారు. 4,794 కిలోమీటర్ల మేరకు రోడ్లు దెబ్బతిన్నాయని.. . 1.38 లక్షల హెక్టార్లలో పంటలకు నష్టం జరిగిందని అంచనా వేశారు. ఈ నేపథ్యంలో నష్టాన్ని అంచనా వేయడానికి కేంద్ర ప్రభుత్వం వెంటనే కేంద్ర బృందాలను రాష్ట్రానికి పంపించి.. ఏపీకి సాయం చేయాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్ కోరారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని మొంథా తుఫాను వణికించింది. ప్రభుత్వం ముందస్తుగా చేపట్టిన చర్యలతో ప్రాణనష్టం లేకుండా బయటపడినప్పటికీ.. భారీగా ఆస్తి నష్టం సంభవించింది. మొంథా తుఫాను నష్టంపై ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రాథమిక నివేదిక రూపొందించింది. ఈ ప్రాథమిక నివేదికను కేంద్ర ప్రభుత్వానికి పంపించింది. ఏపీ ప్రభుత్వం రూపొందించిన ప్రాథమిక నివేదిక ప్రకారం మొంథా తుఫాను బీభత్సంతో ఏపీలో రూ.5,244 కోట్ల మేర నష్టం వాటిల్లింది. రాష్ట్రంలోని 249 మండలాలపై తుఫాను ప్రభావం చూపించింది. 1434 గ్రామాలు, 48 పట్టణాలపై మొంథా తుఫాను ప్రభావం పడినట్లు ప్రాథమిక నివేదికలో పేర్కొన్నారు. మరోవైపు మొంథా తుఫాను ప్రభావిత ప్రాంతాలను పరిశీలించేందుకు కేంద్ర ప్రభుత్వం బృందాలను పంపాలని ఏపీ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్ విజ్ఞప్తి చేశారు. అలాగే ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి తక్షణ సాయం చేయాలని సీఎస్ ఈ నివేదికలో కోరారు.మరోవైపు మొంథా తుఫాను కారణంగా 17 శాఖల్లో రూ.5,244 కోట్లు నష్టం వచ్చిందని నివేదికలో పేర్కొన్నారు. తుఫాను కారణంగా161 మండలాల్లో అత్యధిక వర్షపాతం నమోదైందని.. 4,794 కిలోమీటర్ల మేరకు రహదారులు దెబ్బతిన్నాయని కేంద్రానికి నివేదించారు. 1.38 లక్షల హెక్టార్లలో పంట నష్టం జరిగిందని.. సుమారుగా రూ.829 కోట్ల నష్టం జరిగిందని ప్రాథమికంగా అంచనా వేశారు. ఆక్వారంగంలో రూ.514 కోట్ల నష్టం జరిగినట్లు అంచనా వేశారు. నీటిపారుదలశాఖకు రూ.234 కోట్లు, ఉద్యానవన పంటలకు రూ.40 కోట్ల నష్టం వాటిల్లినట్లు అంచనా వేశారు. అలాగే కరెంట్ స్తంభాలు నేలకూలడం. విద్యుత్ వైర్లు తెగిపోవటం వంటి కారణాలతో విద్యుత్‌శాఖకు రూ.19 కోట్ల నష్టం జరిగిందని ప్రాథమికంగా అంచనా వేశారు. అలాగే తుఫాను కారణంగా 23 జిల్లాల 3,045 ఇళ్లు ధ్వంసమయ్యాయని అధికారులు ప్రాథమికంగా అంచనా వేశారు.మొంథా తుఫాన్ తదనంతర చర్యలపై శుక్రవారం ఉన్నతాధికారులతో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. శాటిలైట్ చిత్రాల ఆధారంగా పంట పొలాలు.. ఎక్కడెక్కడ నీట మునిగాయో గుర్తించాలని ఆదేశించారు. ఆయా ప్రాంతాల్లో 24 గంటల్లోగా మొత్తం నీటిని మళ్లించాలని సీఎం చంద్రబాబు అధికారులకు స్పష్టం చేశారపంటలు నీట మునగడం వల్ల దిగుబడి తగ్గకుండా శాస్త్రవేత్తల సూచనలు తీసుకోవాలని.. అందుకు అనుగుణంగా తగిన విధంగా చర్యలు చేపట్టాలని సూచించారు. మొంథా తుఫాన్‌తో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి జరిగిన నష్టంపై కేంద్రానికి వెంటనే ప్రాథమిక నివేదిక అందించాలని చంద్రబాబు అధికారులను ఆదేశించారు.అలాగే తుఫాన్ రక్షణ చర్యల్లో అత్యుత్తమంగా పనిచేసిన వారిని సన్మానించాలని అధికారులకు నిర్దేశించారు. ఈ నేపథ్యంలోనే.. అధికారులు ప్రాథమిక నివేదిక రూపొందించి.. కేంద్ర ప్రభుత్వానికి నివేదించారు.

# మహిళా సంఘాలకు సాధికారత దిశగా అడుగులు


**విజయవాడ, నవంబర్ 1, పెన్ పవర్:** దేశంలోనే అత్యధిక మహిళా పొదుపు సంఘాలు ఉన్న రాష్ట్రాల్లో ఒకటిగా ఉన్న ఆంధ్రప్రదేశ్ కీలక నిర్ణయాలు తీసుకునేలా చర్యలు తీసుకుంటోంది. మహిళా సాధికారత దిశగా కూటమి ప్రభుత్వం విప్లవాత్మకమైన అడుగు వేస్తోంది. పొదుపు సంఘాల సభ్యులను పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దాలనే లక్ష్యంతో మెప్మా డ్వాక్రా సభ్యుల కోసం ప్రత్యేక కార్యక్రమాన్ని ప్రకటించింది. మహిళా సంఘాలకు కేవలం ఆర్థిక సహాయం చేయడమే కాకుండా అత్యాధునిక డిజిటల్ శిక్షణ ఇవ్వనున్నారు. వారికి సులభతరమైన రుణాల మంజూరు చేయనున్నారు. మార్కెటింగ్ కోసం బ్రాండింగ్ రూపొందిస్తారు. సంపూర్ణ పారదర్శకతను అందించే వాట్సప్ సేవలతో ఒక సమగ్ర ప్యాకేజీ సిద్ధం చేశారు. మహిళల వ్యాపారాలు జాతీయ స్థాయిలో గుర్తింపు పొందేలా, వారి ఉత్పత్తులు ఈ-కామర్స్ వేదికలపై అమ్ముడుపోయేలా పథకాలకు రూపకల్పన చేస్తున్నారు. సాధారణంగా స్వయం సహాయక బృందాలు కేవలం పొదుపు, పరస్పర రుణాలు తీసుకోవడంపై దృష్టి పెడతాయి. కొత్త ప్లాన్ ప్రకారం ప్రతి సంఘ సభ్యురాలు తమ వ్యాపార సామర్థ్యాన్ని పెంచుకోవడానికి వీలుగా, ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉపయోగపడే 8 రకాల సేవల్ని మెప్మా అధికారులు అందుబాటులోకి తీసుకువచ్చారు. అందులో అత్యంత ప్రత్యేకమైనది 'ప్రజ్ఞ వర్చువల్ ట్రైనింగ్ అకాడమీ'. ఈ అకాడమీ ద్వారా మహిళా సభ్యులకు డిజిటల్ అక్షరాస్యత, ఆర్థిక అక్షరాస్యత వంటి అత్యంత కీలకమైన అంశాలపై శిక్షణ ఇస్తున్నారు. ఈ శిక్షణ మొత్తం 12 రకాల ఆన్‌లైన్ సర్టిఫికెట్ కోర్సుల రూపంలో అందుబాటులో ఉంది.21వ శతాబ్దంలో వ్యాపారం చేయాలంటే డిజిటల్ నైపుణ్యాలు చాలా అవసరం. డబ్బును నిర్వహించడం, ఆన్‌లైన్‌లో మార్కెట్ చేయడం, నగదు లావాదేవీల నిర్వహణ వంటి అంశాలపై అవగాహన ఉండాలి. వారు కేవలం చిన్న యూనిట్‌లను నడపడమే కాక, ఆధునిక వ్యాపార ప్రపంచానికి సరితూగేలా తీర్చిదిద్దడం ఈ 'ప్రజ్ఞ' లక్ష్యం. ఈ ఆన్‌లైన్ కోర్సులు పూర్తి చేయడం ద్వారా, సంఘ సభ్యులు స్వయం ఉపాధికి సంబంధించిన 12 రకాల అవకాశాలను అందిపుచ్చుకునే వీలుకలుగుతుంది. శిక్షణతోనే ఈ పథకం ఆగడం లేదు. శిక్షణ పూర్తయిన వెంటనే, మహిళా పారిశ్రామికవేత్తలకు తమ వ్యాపారాలను స్థాపించడానికి వీలుగా బ్యాంకు రుణాలు మంజూరు చేస్తారు. ఈ రుణాలను ఉపయోగించి యూనిట్లు స్థాపించిన మహిళ, కనీసం పది మందికి ఉపాధి అవకాశాలు కల్పించి వారి ఆర్థిక ప్రగతికి తోడ్పడేలా కార్యక్రమాన్ని రూపొందించారు. అంటే, లక్ష మంది పారిశ్రామికవేత్తలు తయారైతే, వారు ప్రత్యక్షంగా పది లక్షల మందికి ఉపాధి కల్పించే అవకాశం కలుగుతుంది. మహిళా సంఘాల సభ్యులు తయారు చేసే ఉత్పత్తులకు తరచుగా ఎదురయ్యే అతిపెద్ద సమస్య మార్కెటింగ్. నాణ్యమైన బ్రాండింగ్ లేకపోవడం కూడా ఇబ్బందిగా ఉంటోంది. ఈ లోపాన్ని సరిదిద్దేందుకు ప్రభుత్వం 'అవని బ్రాండింగ్ మాన్యువల్' అనే ప్రత్యేక విధానాన్ని రూపొందించింది. 'అవని' ద్వారా మెప్మా సభ్యుల ఉత్పత్తులన్నింటికీ ఈ-కామర్స్ వేదికలపై ఒకే రకమైన బ్రాండింగ్, ప్యాకింగ్ విధివిధానాలు రూపొందించారు. ఈ కొత్త విధానం ద్వారా మహిళల ఉత్పత్తులు ఒక ప్రొఫెషనల్ లుక్‌ను సంతరించుకోనున్నాయి. ఇలా చేయడం వల్ల ఆ ఉత్పత్తులకు దేశీయ, అంతర్జాతీయ మార్కెట్‌లో గుర్తింపు వస్తుంది. ఒకే రకమైన బ్రాండ్‌తో మార్కెట్‌లోకి వెళ్లడం వల్ల, వినియోగదారుల్లో కూడా ఆ ఉత్పత్తులపై విశ్వాసం పెరుగుతుంది. ఫలితంగా మంచి గుర్తింపు లభిస్తుంది. వ్యాపార ఆలోచనలను పెంపొందించేందుకు 'లైవ్‌లీహుడ్ ప్రమోషన్స్' పేరుతో ఒక ప్రచార పుస్తకాన్ని సైతం ప్రచురించారు. పట్టణ ప్రాంతాల్లోని మహిళా సంఘాల సభ్యులు సులభంగా ప్రారంభించదగిన వివిధ వ్యాపార ఆలోచనలు ఇందులో ఉంటాయి.ఇప్పటి వరకు ప్రజలకు 'మన మిత్ర వాట్సప్ సేవలను' అందుబాటులో ఉన్నాయి. ఇందులో మహిళా సంఘాలకు కావాల్సిన వివరాలను పొందుపరుస్తున్నారు. ఇదో కీలకమైన మైలురాయిగా మారనుంది. ఈ వాట్సప్ సేవ ద్వారా, సంఘ సభ్యులు తమ వివరాలను ఎప్పుడైనా, ఎక్కడైనా తెలుసుకోవచ్చు. వారి పొదుపు, అప్పు, ఎస్ఎల్ఎఫ్, టీఎల్ఎఫ్ వివరాలు, సంఘాల ఆడిట్ నివేదిక వివరాలు కూడా ఈ 'మన మిత్ర' వాట్సప్ ద్వారా తెలుసుకోవచ్చు. దీనివల్ల పారదర్శకత పెరుగుతుంది. సభ్యుల్లో విశ్వాసం పెరుగుతుంది. తమ ఆర్థిక స్థితిపై పూర్తి అవగాహన ఉండటం వల్ల, మహిళలు తమ వ్యాపార నిర్ణయాలను మరింత పకడ్బందీగా తీసుకోగలరు.ప్రేరణా సఖి, లీప్ పుస్తకంఒక పథకం విజయం సాధించాలంటే, మార్గదర్శకత్వం, స్ఫూర్తి తప్పనిసరి. ఈ అంశాన్ని దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం రెండు ప్రత్యేక డాక్యుమెంటేషన్ ప్రక్రియలను చేపట్టింది. ఇందులో విజయం సాధించిన వారి వివరాలు,

వారి కేస్ స్టడీని చెప్పనున్నారు. ప్రేరణ సఖి వీటి ద్వారా సంఘాల సభ్యుల్లో అత్యున్నత వ్యాపారాలు నిర్వహిస్తున్న మహిళల విజయగాథలను ప్రచురిస్తారు. ఈ విజయగాథలను మిగతా సభ్యులకు చెప్పడం ద్వారా స్ఫూర్తి పొంది, తమ వ్యాపారాలను వృద్ధి చేసుకోగలరు. లీప్ బుక్ ఈ పుస్తకం ద్వారా జీవనోపాధి అవకాశాలను సద్వినియోగం చేసుకున్న మహిళల వివరాలు అందజేస్తారు. ఆడిట్ నివేదికలను ఇందులో నమోదు చేస్తారు. ప్రభుత్వం పథకం అమలు తీరును నిరంతరం పర్యవేక్షించడానికి వీలుంటుంది. పాత పద్ధతులకు స్వస్తి చెప్పి, డిజిటల్ శిక్షణ, సాంకేతిక పారదర్శకత, ఈ-కామర్స్‌కు అనుగుణంగా బ్రాండింగ్ , సంస్థాగత శిక్షణ వంటి వినూత్న కార్యక్రమాల ద్వారా, ప్రభుత్వం మహిళా సాధికారతకు కొత్త నిర్వచనాన్ని ఇస్తోంది. దీంతో రానున్న ఐదేళ్లలో ఆంధ్రప్రదేశ్ ఆర్థిక చిత్రాన్ని మార్చగలదని కూటమి ప్రభుత్వం భావిస్తోంది.

# కిలోకు 25 రూపాయిల కమీషన్

**తిరుమల, నవంబర్ 1, పెన్ పవర్:** తిరుమల లడ్డూ వివాదం పెను ప్రకంపనలకు దారితీసింది. ఈ కేసుకు సంబంధించి విచారణ వేగవంతంగా సాగుతోంది. వైయస్సార్ కాంగ్రెస్ హయాంలో తిరుమల లడ్డు తయారీలో జంతు కొవ్వు వాడారని ఏపీ సీఎం చంద్రబాబు గత ఏడాది జూలైలో సంచలన వ్యాఖ్యలు చేశారు. అది మొదలు రచ్చ రచ్చ జరిగింది. కోట్లాదిమంది శ్రీవారి భక్తులు ఆందోళనకు గురయ్యారు. ఈ నేపథ్యంలో సుప్రీం కోర్టు ఆదేశాల మేరకు సిబిఐ నేతృత్వంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల అధికారులు సంయుక్తంగా దర్యాప్తు చేపడుతున్నారు. గత కొద్దిరోజులుగా విచారణ కొనసాగుతోంది. అయితే ఇటీవల వైవి సుబ్బారెడ్డి సన్నిహితుడు, పీఏ గా భావిస్తున్న వెంకన్న అనే వ్యక్తి అరెస్టయ్యారు. ఆయన అరెస్టు సందర్భంగా ఈ ప్రత్యేక దర్యాప్తు బృందం రిమాండ్ రిపోర్టులో సంచలన అంశాలను బయటపెట్టింది.వాస్తవానికి టీటీడీ అధ్యక్షుడిగా వైవి సుబ్బారెడ్డి ఉండేవారు. ఈయన జగన్మోహన్ రెడ్డికి స్వయానా బాబాయ్. వైసీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే ఈయనను టీటీడీ అధ్యక్షుడిగా నియమించారు. నాలుగేళ్లపాటు ఇదే పదవిలో కొనసాగారు. వైసీపీ అధికారంలోకి వస్తే టీటీడీ అధ్యక్ష పదవి గురించే.. వై వి సుబ్బారెడ్డి కి ఎన్నికల్లో టిక్కెట్ ఇవ్వనట్లు ప్రచారం నడిచింది. అయితే ఏకధాటిగా నాలుగేళ్ల పాటు టీటీడీ అధ్యక్షుడిగా కొనసాగారు వైవి సుబ్బారెడ్డి. ఆ సమయంలో ఆయన పిఏగా అప్పన్న ఉండేవారట. అయితే లడ్డు వివాదం బయటకు వచ్చిన తర్వాత దీనిపై సిబిఐ విచారణ కోరుతూ ఇదే వైవి సుబ్బారెడ్డి సుప్రీంకోర్టులో పిటిషన్ వేశారు. ఆయన పిటిషన్ తోనే కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల సంయుక్త ఆధ్వర్యంలో విచారణకు ఆదేశించింది సుప్రీంకోర్టు. ఇప్పుడు అదే దర్యాప్తు బృందం వై వి సుబ్బారెడ్డి ప్రధాన అనుచరుడు, పిఏను అరెస్టు చేయడం సంచలనంగా మారింది.రిమాండ్ రిపోర్ట్ లో సంచలన అంశాలు బయటకు వచ్చాయి. వై వి సుబ్బారెడ్డి హయాంలో టీటీడీని వెంకన్న ప్రభావితం చేశారన్నది ప్రధాన అభియోగం. బోలె బాబా సంస్థ టీటీడీకి నెయ్యి సరఫరా చేసేందుకు ముందుకు వచ్చింది. అయితే కిలో కు 25 రూపాయల వరకు కమీషన్ ను వెంకన్న డిమాండ్ చేసినట్లు రిమాండ్ రిపోర్ట్ లో పేర్కొన్నారు. అయితే బోలె బాబా సంస్థ ముందుకు రాకపోవడంతో అధికారులపై ఒత్తిడి తెచ్చి వారికి అవకాశం లేకుండా చేశారట. ప్రీమియర్ ఫుడ్స్ అనే సంస్థకు కాంట్రాక్ట్ ఇప్పించారని.. కమీషన్ ఇచ్చేందుకు ముందుకు రావడంతోనే అలా చేశారని రిమాండ్ రిపోర్టులో పేర్కొంది దర్యాప్తు బృందం. అయితే ఇలా వచ్చిన సొమ్మును వైవి సుబ్బారెడ్డి కి బదలాయించారని అనుమానం వ్యక్తం చేసింది. ఇప్పుడు ఈ కేసు సంచలనంగా మారింది. త్వరలో వైవి సుబ్బారెడ్డిని ప్రశ్నించే అవకాశం ఉంది

# మెగా బ్రదర్స్ మధ్య రాజకీయ విభేధాలు



**విజయవాడ, నవంబర్ 1, పెన్ పవర్:** మెగా బ్రదర్స్ మధ్య విభేదాలు వచ్చాయా? గొడవలు జరుగుతున్నాయా? ఈ వార్తల్లో నిజం ఎంత? ఏపీ పొలిటికల్ సర్కిల్లో ఆసక్తికర చర్చ నడుస్తోంది. మెగా బ్రదర్స్ అంటే ఇండియన్ సినిమా ఇండస్ట్రీలోనే ప్రత్యేక గుర్తింపు ఉంది. ముగ్గురు మధ్య మంచి అనుబంధం ఉంటుంది. వారే కాదు మెగా కాంపౌండ్ వాల్ నుంచి వచ్చిన ప్రతి హీరో మధ్య ఒక ఎఫెక్షన్ కనిపిస్తుంది. అయితే ఇటీవల జరిగిన పరిణామాలతో అల్లు అర్జున్ మెగా కుటుంబానికి దూరమైనట్టే. ఆ విషయం పక్కన పెడితే మెగా కుటుంబంలో ఉండే ప్రతి హీరో చాలా బాధ్యతతో, అనుబంధంతో మెలుగుతుంటారు. అయితే ఇప్పుడు పవన్ కళ్యాణ్ సినిమాలతో పాటు పొలిటికల్ వైపు అడుగులు వేశారు. మధ్యలో ఓసారి మెగాస్టార్ చిరంజీవి రాజకీయాల్లోకి వెళ్లి బ్యాక్ డ్రాప్ అయ్యారు. నాగబాబు మాత్రం తమ్ముడు పవన్ కళ్యాణ్ కు అండగా నిలుస్తూ ఎమ్మెల్సీ అయ్యారు. ఇద్దరు తమ్ముళ్లను చూసి చిరంజీవి మురిసిపోతుంటారు. ఇటువంటి తరుణంలో ముగ్గురు మధ్య విభేదాలు వచ్చాయని సోషల్ మీడియాలో ఒక ప్రచారం అయితే మాత్రం జరుగుతోంది.ఇటీవల జరిగిన రాజకీయ పరిణామాలతో మెగాస్టార్ చిరంజీవి అసంతృప్తితో ఉన్నట్లు ప్రచారం నడుస్తోంది. మొన్న ఆ మధ్యన బాలకృష్ణ అసెంబ్లీలో మాట్లాడారు. జగన్ హయాంలో సినీ పరిశ్రమకు జరిగిన అన్యాయాన్ని ప్రస్తావిస్తూ చిరంజీవి గురించి వ్యాఖ్యానించారు. నాడు ఎవరు వెళ్లిన జగన్మోహన్ రెడ్డి స్పందించలేదని చెప్పుకొచ్చారు. ఈ క్రమంలో చిరంజీవి గురించి బాలకృష్ణ తప్పుగా మాట్లాడినట్టు అభిమానులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రత్యేకంగా సమావేశం ఏర్పాటు చేసి బాలకృష్ణ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. అయితే ఏకంగా హైదరాబాదులో మెగా అభిమానులు సమావేశం అయితే అది చిరంజీవికి తెలియదా? నాగబాబు అనుమతి లేకుండా జరిగి ఉంటుందా? పవన్ కళ్యాణ్ కు కనీసం తెలియదా? అని ప్రశ్న ఉత్పన్నమవుతోంది. నాడు బాలకృష్ణ చేసిన వ్యాఖ్యల తర్వాత.. పవన్ కళ్యాణ్ కానీ.. నాగబాబు కానీ స్పందించలేదు. అదే చిరంజీవికి ఇబ్బందికరంగా మారిందన్నది ఒక ప్రచారం. అప్పటినుంచి చిరంజీవి మైండ్ సెట్ మారింది అన్నది సోషల్ మీడియాలో జరుగుతున్న ఒక చర్చ. చిరంజీవి వచ్చే ఎన్నికల్లో జగన్మోహన్ రెడ్డికిమద్దతు తెలుపుతారని.. కొందరు అత్యుత్సాహంగా సోషల్ మీడియాలో పోస్టులు పెట్టారు. దీనిపై సోషల్ మీడియాలో కథనాలు కూడా వస్తున్నాయి. అప్పుడే ఇది ప్రచారం గా తేలిపోయింది. ముఖ్యంగా దీని వెనుక వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఉందని తెలుస్తోంది. గతంలో మెగా కుటుంబం నుంచి అల్లు అర్జున్ ను వేరు చేసి చూపించారు. అల్లు అర్జున్ తమ వాడిగా చిత్రీకరించే ప్రయత్నం చేశారు. ఇప్పుడు కూడా పవన్ కళ్యాణ్ కు వ్యతిరేకంగా చిరంజీవి ఉన్నారని చెప్పి.. మెగా అభిమానుల్లో ఒక చీలిక తేవాలన్నది ప్రయత్నం గా తెలుస్తోంది. అందులో భాగంగానే మెగా బ్రదర్స్ మధ్య విభేదాలు అంటూ ప్రచారం చేస్తున్నారే తప్ప.. అందులో ఎంత మాత్రం వాస్తవం లేదని సన్నిహిత వర్గాలు చెబుతున్నాయి.మెగాస్టార్ చిరంజీవి పొందలేనిది.. దక్కించుకోలేని గౌరవం పవన్ కళ్యాణ్ దక్కించుకున్నారు. దానికి చిరంజీవి కూడా ఆనంద పడుతున్నారు. ఏపీలో కూటమి ప్రభుత్వానికి అధినేతగా చంద్రబాబు ఉన్నారు. ఆయన తరువాత డిప్యూటీ సీఎం గా పవన్ కళ్యాణ్ కు ఎనలేని ప్రాధాన్యత దక్కుతోంది. మరో బ్రదర్ నాగబాబుకు ఎమ్మెల్సీగా అవకాశం ఇచ్చారు. త్వరలో మంత్రి పదవి సైతం ఇవ్వనున్నారు. దీనిపై మెగాస్టార్ చిరంజీవి సైతం సంతృప్తిగా ఉన్నారు. ప్రమాణ స్వీకారం చేసిన నాడు చిరంజీవికి కూడా ఎంతో ప్రాధాన్యత దక్కింది. తన తమ్ముళ్లు ఇద్దరు రాజకీయ ప్రయోజకులు గా మారడంతో చిరంజీవి కూడా సంతృప్తిగా ఉన్నారు. ఇటువంటి పరిస్థితుల్లో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి ఇది ఇబ్బందికరంగా మారింది. మెగా అభిమానుల్లో ఒక గందరగోళం సృష్టించేందుకే ఈ కొత్త ప్రయోగం చేస్తున్నారని మెగా సన్నిహిత వర్గాలు అంచనా వేస్తున్నాయి

# ప్లేయింగ్ 11లో హర్లీన్ డియోల్‌కు ఛాన్స్.. ఫైనల్‌కు రెండు మార్పులతో ఇండియా!







**హైదరాబాద్ పెన్ పవర్:** మహిళల వరల్డ్ కప్ లో సౌతాఫ్రికాతో జరగబోయే ఫైనల్లో టీమిండియా అమీతుమీ తేల్చుకోనుంది. 47 ఏళ్ళ వరల్డ్ కప్ చరిత్రలో మూడో సారి ఫైనల్ కు వెళ్లిన మన జట్టు ఈ సారి టైటిల్ గెలవాలనే గట్టి పట్టుదలతో కనిపిస్తుంది. ఆదివారం (నవంబర్ 2) ముంబైలోని డాక్టర్ డివై పాటిల్ స్పోర్ట్స్ అకాడమీలో ఫైనల్ జరగనుంది. సూపర్ ఫామ్ లో ఉన్న సౌతాఫ్రికాను ఓడించాలంటే అంత ఈజీ కాదు. ఆస్ట్రేలియాతో జరిగిన సెమీ ఫైనల్ టీంఇండియాలో ఫుల్ జోష్ నింపింది. 339 పరుగులను ఛేజ్ చేయడంతో ఆత్మవిశ్వాసం పెరిగింది. సౌతాఫ్రికాపై జరగనున్న మెగా ఫైనల్లో ఎలాంటి జట్టుతో బరిలోకి దిగుతుందో చూద్దాం..

సౌతాఫ్రికాపై జరగబోయే ఫైనల్లో ఓపెనర్ షెఫాలీ వర్మను ప్లేయింగ్ 11 నుంచి తప్పించే అవకాశాలు కనిపిస్తున్నాయి. ప్రతీక రావల్ గాయపడడంతో లక్కీగా జట్టులోకి వచ్చిన షెఫాలీ 10 పరుగులే చేసి నిరాశపరించింది. దూకుడుగా ఆడతుంది అనే పేరున్న ఈ యువ ఓపెనర్ ఫైనల్ లో కొనసాగడం కష్టంగానే కనిపిస్తుంది. షెఫాలీ ప్లేస్ లో హర్లీన్ డియోల్ తుది జట్టులోకి రావొచ్చు. డియోల్ మంచి ఫామ్ లో ఉంది. అంతేకాదు ఈ వరల్డ్ కప్ లోనూ కొని మంచి ఇన్నింగ్స్ లు ఆడింది. దీంతో స్మృతు మందానతో కలిసి ఇండియా ఇన్నింగ్స్ ఆరంభించవచ్చు. సెమీ ఫైనల్లో చోటు కోల్పోయిన డియోల్ ఫైనల్ లో ఛాన్స్ వస్తుందేమో చూడాలి.

**క్రాంతి గౌడ్ ఔట్:**

ఆస్ట్రేలియాతో జరిగిన సెమీ ఫైనల్ మ్యాచ్ లో టీమిండియా యువ ఫాస్ట్ బౌలర్ క్రాంతి గౌడ్ పేలవ ప్రదర్శన చేసింది. 6 ఓవర్లు బౌలింగ్ వేసి ఏకంగా 58 పరుగులు ఇచ్చింది. ఆమె ఎకానమీ ఓవర్‌కు 9.70 పరుగులు ఉండడం ఆందోళనకు గురి చేస్తుంది. అలిస్సా హీలీ వికెట్‌ను పడగొట్టినప్పటికీ భారీగా పరుగులు ఇవ్వడంతో ఆమె స్థానంలో అరుంధతి రెడ్డికి అవకాశం దక్కొచ్చు. అరుంధతి రెడ్డి ఈ టోర్నీలో ఇప్పటివరకు ఒక్క మ్యాచ్ లో కూడా ఆడలేదు. ఫైనల్ కు ఆమెను బరిలోకి దింపాలా.. వద్దా అని జట్టు యాజమాన్యం ఆలోచిస్తుంది. సౌతాఫ్రికా జట్టు స్పిన్ ఆడడంలో బలహీనం కాబట్టి స్నేహ రానాకి తుది జట్టులో స్థానం లభించినా పెద్దగా ఆశ్చర్యం లేదు.

ఫైనల్ జరగబోయే డివై పాటిల్ స్టేడియంలో వర్ష సూచనలు కనిపిస్తున్నాయి. వాతావరణ రిపోర్ట్స్ ప్రకారం ఫైనల్ కు కూడా వర్షం ముప్పు పొంచి ఉంది. ఈ టోర్నమెంట్ లో ఈ స్టేడియంలో జరిగిన చాలా మ్యాచ్ లు వర్షం

కారణంగా ఫలితం రాలేదు. లీగ్ స్టేజ్ లో ఇండియా- న్యూజిలాండ్ మ్యాచ్‌కు పలు మార్లు వర్షం అంతరాయం కలిగించింది. ఆ తర్వాత బంగ్లాదేశ్ పై ఇండియా ఆడిన లీగ్ మ్యాచ్ కూడా ఫలితం రాకపోవడంతో మ్యాచ్ ను రద్దు చేశారు. గెలిచిన జట్టు ఛేజింగ్ చేసే అవకాశాలు ఎక్కువ కనిపిస్తున్నాయి. వర్షం ముప్పు ఉండడంతో సెకండ్ ఇన్నింగ్స్ లో మంచు ప్రభావం బౌలర్లకు ప్రతికూలంగా మారనుంది.

**ఇండియా ప్లేయింగ్ 11(అంచనా):**

స్మృతి మంధాన, షఫాలీ వర్మ, జెమిమా రోడ్రిగ్స్, హర్మన్‌ప్రీత్ కౌర్ (కెప్టెన్), దీప్తి శర్మ, రిచా ఘోష్ (వికెట్ కీపర్), అమంజోత్ కౌర్, రాధా యాదవ్, క్రాంతి గౌడ్, శ్రీ చరణి, రేణుకా ఠాకూర్

**సౌతాఫ్రికా ప్లేయింగ్ 11 (అంచనా):**

లారా వోల్వార్ట్(కెప్టెన్), తజ్మిన్ బ్రిట్స్, సునే లూస్, అన్నరీ డెర్క్‌సెన్, అన్నెకే బాష్, మారిజాన్ కాప్, సినాలో జాఫ్తా (వికెట్ కీపర్), క్లో ట్రయాన్, నాడిన్ డి క్లెర్క్, అయాబొంగా ఖాకా, నాన్‌కులులేకో మ్లాబా

# మెన్స్‌ను మించిపోయారు: వరల్డ్ కప్ విజేత, రన్నరప్‌లకు ప్రైజ్ మనీ ఎంతంటే..?




**హైదరాబాద్ పెన్ పవర్:** భారత్, శ్రీలంక వేదికలుగా జరుగుతున్న మహిళా క్రికెట్ వన్డే వరల్డ్ కప్ క్లైమాక్స్ కు వచ్చింది. నెల రోజుల పాటు అభిమానులను అలరిస్తూ వస్తున్న వరల్డ్ కప్ లో ఫైనల్ మాత్రమే మిగిలింది. టోర్నీ మొత్తం అద్భుతంగా రాణించిన ఇండియా, సౌతాఫ్రికా జట్లు ఫైనల్ ఆడనున్నాయి. ఆదివారం (నవంబర్ 2) జరగనున్న ఈ గ్రాండ్ ఫైనల్ ముంబైలోని డాక్టర్ డివై పాటిల్ స్పోర్ట్స్ అకాడమీలో జరుగుతుంది. 12 సంవత్సరాల సుదీర్ఘ విరామం తర్వాత ఇండియాలో వరల్డ్ కప్ జరగనుండడంతో ఫ్యాన్స్ ఈ సారి మన మహిళల జట్టు ట్రోఫీ గెలుస్తుందని ఆశలు పెట్టుకున్నారు. భారత్ చివరగా 2013లో ప్రపంచ్ కప్?కు ఆతిథ్యం ఇవ్వగా.. ఈ టోర్నీలో ఇండియా ఉమెన్స్ టీమ్ గ్రూప్ దశలోనే నిష్క్రమించింది. మరోవైపు సౌతాఫ్రికా మహిళా జట్టు తొలిసారి ఫైనల్ కు చేరుకుంది. ఫైనల్లో ఇండియాకు గెలిచి తమపై చోకర్స్ అనే ముద్రను పోగొట్టుకోవాలని చూస్తుంది. సొంత దేశంలో టోర్నీ కావడంతో భారత్ హాట్ ఫేవరెట్. ఈ ఫైనల్లో గెలిచిన జట్టుకు కాసుల వర్షం కురవడం ఖాయంగా కనిపిస్తుంది. ఈ టోర్నీలో విజేతగా నిలిచిన జట్టు.. రన్నరప్ గా నిలిచిన జట్టు ఎన్ని కోట్లు గెలుచుకుంటుందో.. టోర్నీ ప్రైజ్ మనీ ఎంతో ఇప్పుడు చూద్దాం.. ప్రస్తుతం జరుగుతున్న మహిళల వన్డే వరల్డ్ కప్ కు ఐసీసీ ప్రైజ్ మనీని భారీగా పెంచేసింది. మొత్తం వరల్డ్ కప్ ప్రైజ్ మనీ రూ. 122 కోట్లుగా నిర్ణయించారు. విజేతగా నిలిచిన జట్టుకు రూ. 39 కోట్ల రూపాయలు అందుతాయి. రన్నరప్ గా నిలిచిన జట్టుకు రూ. 20 కోట్ల రూపాయల ప్రైజ్ మనీ అందుతాయి. సెమీ ఫైనల్ గా నిలిచిన రెండు జట్లకు రూ. 10 కోట్ల ప్రైజ్ మనీ లభిచనుంది. ఒక్కో విజయానికి రూ. 30 లక్షల రూపాయాలు అందనున్నాయి. వరల్డ్ కప్ కు అర్హత సాధించిన 8 జట్లకు రూ. 2.2 కోట్ల రూపాయలు దక్కనున్నాయి.

చివరిసారిగా 2022లో జరిగిన వరల్డ్ కప్ తో పోలిస్తే ప్రైజ్ మనీతో 300 శాతం పెరగడం విశేషం. సెప్టెంబర్ 30 నుండి నవంబర్ 2 వరకు ఈ టోర్నీకి ఇండియా ఆతిధ్యమివ్వడంతో భారీ హైప్ నెలకొంది. ఎనిమిది జట్లు పాల్గొనే ఈ టోర్నమెంట్ ప్రైజ్ మనీ ఏకంగా 2023లో మెన్స్ క్రికెట్ లో ఇచ్చిన ప్రైజ్ మనీ కంటే ఎక్కువ కావడం ఆశ్చర్యానికి గురి చేస్తోంది. భారత్ వేదికగా జరిగిన 2023 వన్డే వరల్డ్ కప్ ప్రైజ్ మనీ రూ. 88 ఓట్ల రూపాయాలు కాగా.. ప్రస్తుతం ఇండియాలో జరగబోయే వరల్డ్ కప్ ప్రైజ్ మనీ రూ. 118 కోట్లు కావడం గమనార్హం. అంటే మెన్స్ కంటే రూ.30 కోట్లు ఎక్కువన్నమాట.

# సుదీర్ఘ కెరీర్ కు ముగింపు పలికిన భారత టెన్నిస్ దిగ్గజం

**హైదరాబాద్ పెన్ పవర్:** భారత టెన్నిస్ దిగ్గజం, రెండుసార్లు గ్రాండ్‌స్లామ్ విజేత రోహన్ బోపన్న తన సుదీర్ఘ కెరీర్‌కు ముగింపు పలికాడు. 20 ఏళ్ల పాటు సాగిన తన ప్రొఫెషనల్ టెన్నిస్ ప్రయాణానికి వీడ్కోలు పలుకుతున్నట్టు శనివారం ప్రకటించాడు. పారిస్ మాస్టర్స్-1000 టోర్నమెంట్‌లో ఆడిన కొద్ది రోజులకే బోపన్న ఈ నిర్ణయం తీసుకోవడం గమనార్హం.భారత టెన్నిస్ చరిత్రలో అత్యుత్తమ ఆటగాళ్లలో ఒకరిగా పేరుగాంచిన 45 ఏళ్ల బోపన్న, తన కెరీర్‌లో ఎన్నో శిఖరాలను అధిరోహించాడు. ముఖ్యంగా, 43 ఏళ్ల వయసులో 2024లో ఆస్ట్రేలియన్ ఓపెన్ పురుషుల డబుల్స్ టైటిల్ గెలిచి, ప్రపంచ నెం.1 ర్యాంకును అందుకొని చరిత్ర సృష్టించాడు. అంతకుముందు 2017లో గబ్రియేలా డబ్రోస్కీతో కలిసి ఫ్రెంచ్ ఓపెన్ మిక్స్‌డ్ డబుల్స్ టైటిల్‌ను కూడా కైవసం చేసుకున్నాడు.తన రిటైర్మెంట్ నిర్ణయాన్ని సోషల్ మీడియాలో ఒక సుదీర్ఘమైన, భావోద్వేగ పోస్ట్ ద్వారా వెల్లడించాడు. "జీవితానికి అర్థాన్నిచ్చిన దానికి ఎలా వీడ్కోలు చెప్పాలి? 20 ఏళ్ల మరపురాని ప్రయాణం తర్వాత, నేను అధికారికంగా నా రాకెట్‌కు విశ్రాంతినిస్తున్నాను" అని బోపన్న తన పోస్ట్‌లో పేర్కొన్నాడు. తన ప్రయాణం కూర్గ్ అనే చిన్న పట్టణంలో మొదలైందని, పగుళ్లిచ్చిన కోర్టుల నుంచి ప్రపంచంలోని అతిపెద్ద వేదికలపై ఆడే స్థాయికి ఎదగడం ఒక కలలా ఉందని గుర్తు చేసుకున్నాడు.

ఈ ప్రయాణంలో తనకు అండగా నిలిచిన తల్లిదండ్రులు, సోదరి, భార్య సుప్రియ, కుమార్తె త్రిథ, కోచ్‌లు, అభిమానులు, దేశానికి కృతజ్ఞతలు తెలిపాడు. "భారత్‌కు ప్రాతినిధ్యం వహించడం నా జీవితంలో లభించిన గొప్ప గౌరవం. త్రివర్ణ పతాకం పేరుతో బరిలోకి దిగిన ప్రతిసారీ ఆ గర్వాన్ని, బాధ్యతను మోశాను" అని బోపన్న ఉద్ఘాటించాడు. తన కెరీర్‌లో మొత్తం ఐదు గ్రాండ్‌స్లామ్ ఫైనల్స్‌కు చేరిన బోపన్న, డేవిస్ కప్, ఒలింపిక్స్‌లోనూ దేశానికి ప్రాతినిధ్యం వహించాడు.

తాను పోటీల నుంచి తప్పుకుంటున్నప్పటికీ, టెన్నిస్‌తో తన బంధం ముగియలేదని స్పష్టం చేశాడు. "చిన్న పట్టణాల నుంచి వచ్చే యువ క్రీడాకారులలో స్ఫూర్తి నింపాలనుకుంటున్నాను. ఇది వీడ్కోలు కాదు, నాకు అండగా నిలిచిన ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు" అని బోపన్న తన పోస్ట్‌ను ముగించాడు.

# నాగార్జున- జాకీ ష్రాఫ్ మధ్య ఈ కనెక్షన్ గురించి తెలుసా?







అక్కినేని నాగేశ్వరరావు నటవారసుడిగా కింగ్ నాగార్జున తన తండ్రి లెగసీని ముందుకు నడిపించడంలో విజయవంతం అయ్యారు. నేడు టాలీవుడ్ మూల స్థంభాలలో ఆయన ఒకరు. అగ్ర కథానాయకుడిగా దశాబ్దాల పాటు పరిశ్రమను ఏలిన నాగార్జున సినీనిర్మాతగాను తనదైన ముద్ర వేసారు. అన్నపూర్ణ స్టూడియోస్ అధినేతగా విజయవంతమైన వ్యాపారవేత్తగా, ఎంటర్ ప్రెన్యూర్ గాను సత్తా చాటారు.అయితే కింగ్ నాగార్జున నటుడు ఎలా అయ్యారు? ఆయన మొదటి సినిమా ఎంపిక వెనుక ఎవరున్నారు? అతడికి బాలీవుడ్ నటుడు జాకీ ష్రాఫ్ తో ఉన్న కనెక్షన్ ఏమిటి? ఇవన్నీ తెలుసుకుంటే అభిమానులకు నిజంగా బిగ్ సర్ ప్రైజ్. అసలు నాగార్జున %-%విక్రమ్%-% సినిమాని ఎంపిక చేసినది - అక్కినేని నాగేశ్వరరావు. ఇదే సినిమాతో బాలీవుడ్ లో జాకీ ష్రాఫ్ కూడా డెబ్యూ నటుడిగా ఆరంగేట్రం చేసాడు. ఒకే సమయంలో ఒకేసారి నాగార్జున, జాకీ ష్రాఫ్ ఆరంగేట్రం చేయడం అప్పట్లో ఒక పెద్ద విషయం. ఎయిటీస్ క్లాస్ హీరోల్లో ఇప్పటికీ జాకీ ష్రాఫ్ నాగార్జునకు కనెక్ట్ అయి ఉన్నారు. అతడు నాగార్జున, చిరంజీవి, వెంకటేష్ లాంటి నటులకు అత్యంత సన్నిహితుడు.కింగ్ నాగార్జునకు

నటవారసుడిగా తెరంగేట్రం చేసినా నాగార్జున ప్రయోగాల బాటలో తనదైన మార్క్ వేస్తూ ఇండస్ట్రీ బెస్ట్ హీరోగా నిరూపించారు.

%-%విక్రమ్%-% సినిమా ఆశించిన విజయాన్ని ఇవ్వలేదు. ఆ తర్వాత అతడు మజ్ను, జానకి రాముడు, విక్కీ దాదా లాంటి హిట్ చిత్రాల్లో నటించాడు. రామ్ గోపాల్ వర్మతో %-%శివ%-% సినిమా ట్రెండ్ సెట్టర్ గా మారింది. ఈ సినిమా కల్ట్ క్లాసిక్ హిట్ గా సంచలనం సృష్టించిన సంగతి తెలిసిందే. ఆర్జీవీని దర్శకుడిగా పరిచయం చేస్తూ నాగార్జున స్వయంగా అన్నపూర్ణ బ్యానర్ లో నిర్మించిన ఈ చిత్రం దర్శకహీరోలిద్దరికీ బిగ్ బ్రేక్ నిచ్చింది.కెరీర్ ఆరంభం ఎన్నో స్ట్రగుల్స్ ఎదుర్కొన్న నాగార్జున, జాకీ ష్రాఫ్ వారు ఎంపిక చేసుకున్న క్రాఫ్ట్ లో మాస్టర్స్ అయ్యారు. ఇద్దరూ ప్రయోగాత్మక పంథాలో కెరీర్ ని నడిపించారు. జాకీ ష్రాఫ్ సహాయనటుడిగా, హీరోగా వైవిధ్యమైన పాత్రలతో మెప్పించారు.

ఒక



Printed by Published by GANTYADA APPARAO on behalf of GANTYADA APPARAO, printed at D.NO: 49-1-35, MIRIYALAPALEM CENTER, RAILWAY STATION ROAD, ONGOLE MANDAL, prakasam district, Andhrapradesh-523001. and published at 38/291-6, Sreerama nagar colony, Near Central prison, KADAPA CITY, KADAPA DISTRICT, ANDHRAPRADESH-516002, Editor : GANTYADA APPARAO Mobile : 9059465965, RNI : APTEL/25/A2231, editorpenpower@gmail.com